మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 2-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 65 Issue: 65

Circulated to Telangana
Published from Jagitial

02 సెప్టెంబర్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:25 తిథి పంచమి ఉ. 6:12 వరకు తరువాత షష్ఠి తె. 4:25ం వరకు సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం భరణి రా. 1:41ం వరకు తరువాత కృతిక యోగం ధ్రువ రా. 9:06 వరకు కరణం తైతుల ఉ. 6:12 వరకు గరజి సా. 5:19 వరకు వర్జ్యం ఉ. 11:54 నుండి మ. 1:26 వరకు దుర్ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:40 వరకు రాహుకాలం మ. 12:15 నుండి మ. 1:48 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:10 వరకు గుళికాకాలం ఉ. 10:43 నుండి మ. 12:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు రా. 8:44 నుండి రా. 10:16 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

# మన దేశం.. మన పైసా!



## విదేశాల్లో పెళ్లిళ్లు వద్దు

**విదేశీ ప్రయాణాలూ వద్దు. బంగారం కొనుడు అసలే వద్దు**

**స్వదేశీ వస్తువులకే ప్రాధాన్యం.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు**

**ఆర్థిక వృద్ధి రేటు 7.8 శాతంపై హర్షం.. ఇలాగే కొనసాగాలని ఆకాంక్ష**

దేశ ఆర్థిక వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదు కావడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. దేశ ప్రజల సంకల్ప బలం, సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మంగళవారం ఉదయం సోషల్ మీడియా వేదికగా ఓ సెల్ఫీ వీడియోని విడుదల చేశారు. ప్రపంచ దేశాలు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో భారత్ మాత్రం అసాధారణ ఘనతను సాధించిందని చెప్పుకొచ్చారు. 'ప్రపంచమంతా యుద్ధ వాతావరణంలో కూరుకుపోయింది. ఎక్కడ చూసినా యుద్ధ వార్తలే వినిపిస్తున్నాయి.

న్యూఢిల్లీ: ప్రపంచం సంక్షోభాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. 2020 నాటి కొవిడ్ కాలం నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అనేక దేశాలు ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం, ఇతర క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అయినప్పటికీ.. భారత్ వేగంగా పురోగమిస్తోంది. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోంది. 140 కోట్ల మంది భారత ప్రజల సమష్టి కృషి, సంకల్ప బలంతోనే ఈ అసాధారణ విజయం సాధ్యమైంది' అని ప్రధాని తెలిపారు. నిరాశతో కూరుకుపోయిన విపక్షాలు ప్రభుత్వంపై -2 వ పేజీలో...

# ఏఐ.. వాడేయ్!

**కృత్రిమ మేధలో జెన్ జీ భారతం.. వారానికి ఒకసారైనా వాడకం**

**చదువు, కోడింగ్, ఉద్యోగ నైపుణ్యాల కోసం వినియోగం**

**ఎమిరిటస్ సర్వేలో వెల్లడి**




భారత యువతలో ఐ కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం రోజువారీ జీవితంలో భాగంగా మారుతోంది. చదువు, కొత్త నైపుణ్యాల అభ్యసనం, ఉద్యోగావకాశాల కోసం సిద్ధం కావడం వంటి అంశాల్లో జెన్-జీ యువత ఏఐ సాధనాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నట్లు తాజా సర్వే వెల్లడించింది. జెన్-జీకు చెందిన సుమారు 82 శాతం మంది వారానికి కనీసం ఒక్కసారైనా ఏఐ లేదా ఉత్పాదక కృత్రిమ మేధ (జెనరేటివ్ ఏఐ) సాధనాలను ఉపయోగిస్తున్నట్లు ఎమిరిటస్ సంస్థ నివేదిక పేర్కొంది.

న్యూఢిల్లీ: 'ఇండియాస్ జెన్ జీ ఔట్‌లుక్ 2026: రీక్యాలిబ్రేటింగ్ ఎడ్యుకేషన్, యాంబిషన్ అండ్ సక్సెస్ -- ది నో క్యాప్ జనరేషన్' పేరుతో విడుదల చేసిన నివేదిక కోసం 15 నుంచి 28 ఏళ్ల మధ్య వయసున్న 1,010 మందిని సర్వే చేశారు. వీరిలో కళాశాల పూర్వ విద్యార్థులు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్నవారు, ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించినవారు ఉన్నారు. భారత్‌లో ఏఐ వినియోగం విద్యా రంగానికే పరిమితం కావడం లేదు. కోడింగ్, పత్రాల సవరణ, ఉద్యోగ దరఖాస్తుల కోసం జీవిత చరిత్ర (రెజ్యూమ్) తయారీ, కంటెంట్ సృష్టి, ఇతర వృత్తిపరమైన పనుల కోసం కూడా యువత ఏఐ సాధనాలను ఉపయోగిస్తోంది. ఆంథ్రోపిక్ సంస్థకు చెందిన ప్రత్యేక నివేదిక కూడా భారత్‌లో ఏఐ వినియోగం పెరుగుతున్న విషయాన్ని వెల్లడించింది. భారత్‌లో క్లాడ్ ఏఐతో జరిపిన సంభాషణల్లో 19.3 శాతం విద్య, అభ్యసనానికి సంబంధించినవే కాగా, 7.9 శాతం సంభాషణలు ఇంటి పనులు (హోంవర్క్)కు సంబంధించినవి అని ఆ నివేదిక పేర్కొంది. గణితం, కంప్యూటర్ సైన్స్ సిద్ధాంతం, ఏఐ ఆధారిత అనువర్తనాల తరువాయి 2 వ పేజీలో...

# ఆర్మీ అడ్డాలో ఆయుధాల చోరీ!

## సికింద్రాబాద్ ఆర్మీ కాంపౌండ్‌లో దొంగతనం

**4 ఏకే-47 రైఫిళ్లు, పిస్టళ్లు అపహరణ.. రంగంలోకి దిగిన బొల్లారం పోలీసులు**




సికింద్రాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): సికింద్రాబాద్‌లోని అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే మద్రాస్ రెజిమెంట్ ప్రాంతంలో సంచలన ఘటన వెలుగు చూసింది. ప్రహరీ గోడలు, మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉండే ఆర్మీ కాం పౌండ్‌లోకి చొరబడిన దుండగులు ఆయుధాల గది తాళాలు పగలగొట్టి ఏకంగా 12 అత్యాధునిక ఆయుధాలను అపహరించారు. చోరీకి గురైన వాటిలో నాలుగు ఏకే-47 రైఫిళ్లు, తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,409 |
| వెండి (కిలో): | రూ.2,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,489 |

## విశ్వవాణి



అమెరికాలోని అరిజోనా రాష్ట్రం విల్‌కాక్స్ బేసిన్‌లో భూగర్భజలాలను అధికంగా తోడేస్తుండటంతో భూమి వేగంగా కుంగిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో ఏటా 15 సెంటీమీటర్లకు పైగా భూమి దిగజారుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. గత కొన్ని దశాబ్దాల్లో కొన్ని ప్రాంతాల్లో నేల ఇప్పటికే కొన్ని మీటర్ల మేర కుంగిపోయింది. భూగర్భజలం తగ్గిపోవడంతో మట్టి, రాతి పొరల మధ్య ఉన్న ఖాళీలు క్రమంగా కూలిపోతున్నాయి.



# నీట్ నిరసనల కేసులన్నీ రద్దు

## విద్యార్థులకు సుప్రీం గుడ్ న్యూస్

**నేర చరిత్ర ఉన్నవారిపై ఎఫ్ఐఆర్‌లు కొనసాగింపు**

న్యూఢిల్లీ: నీట్ యూజీ ప్రశ్నపత్రం లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో చేపట్టిన నిరసనల్లో పాల్గొని, కేసులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు భారీ ఉపశమనం లభించింది. వారిపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నేర చరిత్ర ఉన్నవారిని మినహాయించి, జులై 20 నుంచి తరువాయి 2 వ పేజీలో...

# తుమ్మిడిహట్టిపై తెలంగాణ పట్టు

## 152 మీటర్ల ఎత్తు కావాలంటున్న సర్కార్.. ఢిల్లీలో కీలక భేటీ.. సీడబ్ల్యూసీ మధ్యవర్తిత్వం



ఉమ్మడి ఆదిలాబాద్‌కు సాగునీరు అందించే తుమ్మిడిహట్టి బరాజ్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం మరోసారి తన ప్రతిపాదనను బలంగా వినిపించింది. బరాజ్‌ని గతంలో ప్రతిపాదించిన 148 మీటర్ల ఎత్తులో కాకుండా 152 మీటర్ల ఎత్తుతో నిర్మించాల్సిందేనని తెలంగాణ అధికారులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): ఈ అంశంపై తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన కీలక సమావేశం ముగిసింది. ఢిల్లీలోని సేవా భవన్‌లో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సీడబ్ల్యూసీ చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన జలవనరుల శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. తుమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలతో పాటు బరాజ్ ఎత్తు, ముంపు ప్రభావం, అంతర్రాష్ట్ర అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణానికి సంబంధించి గతంలో ఇరు తరువాయి 2 వ పేజీలో...



# కల్యాణలక్ష్మికి ఓకే

**పథకం కొనసాగింపునకు హైకోర్టు సమ్మతి**

**సర్కారుకు అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు**

**సింగిల్ బెంచి స్టే ఉత్తర్వులు రద్దు**

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): . కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన తరువాయి 2 వ పేజీలో...



# ఏపీలో సర్ గడువు పెంపు

## క్లెయిమ్‌లపై 10 వరకు అవకాశం

**అక్టోబర్ 5లోగా అభ్యంతరాల పరిష్కారం.. అక్టోబర్ 9న తుది జాబితా విడుదల**

విజయవాడ, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ గడువు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి అభ్యర్థన మేరకు ఏపీకి సంబంధించి ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. కొత్త షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసేందుకు సెప్టెంబర్ 10 వరకూ అవకాశం ఇచ్చారు. ఓటర్ లిస్టులో పేర్లు, ఇతరత్రా వివరాలపై ఏవైనా అభ్యంతరాలు తరువాయి 2 వ పేజీలో...

# హస్తినకు కొండా సురేఖ

## కాంగ్రెస్ హైకమాండ్ నుంచి పిలుపు

**ఢిల్లీకి చేరిన పంచాయితీ.. అధిష్ఠానం డెసిషన్‌పై ఉత్కంఠ**



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖకు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి తరువాయి 2 వ పేజీలో...



# హైడ్రా రంగ్‌నాథ్‌కు రిలీఫ్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ పదవి నుంచి తొలగించాలని, ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం (డివిజన్ బెంచ్) సస్పెండ్ చేసింది. అక్రమ కట్టడాల తరువాయి 2 వ పేజీలో...



# తుమ్మిడిహట్టిపై తెలంగాణ పట్టు

**మొదటి పేజీ తరువాయి**

రాష్ట్రాల మధ్య 148 మీటర్ల ఎత్తుపై అంగీకారం కుదిరింది. అయితే తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఈ ఎత్తును 152 మీటర్లకు పెంచాలని ప్రతిపాదిస్తోంది. ఇందుకు సంబంధించిన సాంకేతిక అంశాలను తెలంగాణ అధికారులు సీడబ్ల్యూసీ, మహారాష్ట్ర అధికారుల ముందు వివరించినట్లు తెలుస్తోంది. తుమ్మిడిహట్టి బరాజ్‌ని 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే సాగునీటిని గ్రావిటీ ద్వారా తరలించడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలంగాణ అధికారులు వాదించారు. దీంతో నీటిని ముందుకు తరలించేందుకు పంపింగ్‌పై ఆధారపడాల్సి వస్తుందని.. దీనివల్ల భవిష్యత్‌లో భారీగా విద్యుత్ వ్యయం అయ్యే అవకాశం ఉందని వివరించినట్లు తెలుస్తోంది. అదే బరాజ్ ఎత్తును 152 మీటర్లకు పెంచితే నీటిని మరింత సమర్థంగా తరలించడంతో పాటు పంపింగ్‌పై ఆధారపడే అవసరం తగ్గుతుందని తెలంగాణ అధికారులు సమావేశంలో వివరించారు. సాగు నీటి అవసరాలు, భవిష్యత్ విద్యుత్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని 152 మీటర్ల ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని మహారాష్ట్రను కోరినట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణ ప్రతిపాదించిన 152 మీటర్ల ఎత్తుపై మహారాష్ట్ర నుంచి ఇప్పటికైతే స్పష్టమైన అంగీకారం రాలేదని సమాచారం. దీంతో 152 మీటర్ల ప్రతిపాదనకు అంగీకారం కుదరకపోతే కనీసం 150 మీటర్ల ఎత్తుకైనా ఒప్పుకోవాలని తెలంగాణ అధికారులు ప్రత్యామ్నాయ ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. బరాజ్ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ఏర్పడే ముంపు, ఇతర సాంకేతిక ప్రభావాలను కూడా ఇరు రాష్ట్రాలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల తెలంగాణ సమర్పించిన సాంకేతిక నివేదికను మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర జల సంఘం అధికారులు పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుమ్మిడిహట్టి బరాజ్ ఎత్తుపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడానికి సీడబ్ల్యూసీ మధ్యవర్తిత్వం చేస్తోంది. తాజా సమావేశంలో తెలంగాణ తన వాదనను వివరంగా వినిపించగా.. మహారాష్ట్ర అధికారులు కూడా తమ అభ్యంతరాలు, సాంకేతిక అంశాలను వివరించినట్లు తెలుస్తోంది. బరాజ్ ఎత్తు, ముంపు అంచనాలు, ఇతర సాంకేతిక అంశాలపై మరింత అధ్యయనం చేసిన తర్వాత మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. సుమారు 2 వారాల తర్వాత సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో మరో ఉన్నతస్థాయి సమావేశం జరిగే అవకాశం ఉంది. ఆ భేటీలో తుమ్మిడిహట్టి బరాజ్ ఎత్తుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ను ముందుకు తీసుకెళ్లడంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడంతో పాటు కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి కూడా అంశాన్ని తీసుకెళ్లారు. ఇప్పటికే పలు సాంకేతిక, అంతర్రాష్ట్ర సమస్యల కారణంగా తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ముందుకు సాగడంలో జాప్యం జరిగింది. ఇప్పుడు కేంద్ర జల సంఘం వేదికగా ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య చర్చలు ప్రారంభం కావడంతో ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. అయితే 152 మీటర్ల ఎత్తుపై మహారాష్ట్ర అంగీకారం సాధించడమనే తెలంగాణకు ప్రధాన సవాలుగా మారింది. రానున్న సమావేశాల్లో ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వస్తాయా లేక తుమ్మిడిహట్టి బరాజ్ ఎత్తు చివరకు ఎంత ఖరారవుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# హస్తినకు కొండా సురేఖ

**మొదటి పేజీ తరువాయి**

నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం గమనార్హం.



# ఏఐ.. వాడేయ్!

**మొదటి పేజీ తరువాయి**

అభివృద్ధి, వెబ్ అభివృద్ధి వంటి అంశాల్లో భారతీయ వినియోగదారులు ప్రపంచ సగటుతో పోలిస్తే ఎక్కువగా ఏఐని ఉపయోగిస్తున్నట్లు ఆంత్రపిక్ నివేదిక తెలిపింది. భారత్‌లో గణితం, కంప్యూటర్ సైన్స్ సిద్ధాంతానికి ఏఐ వినియోగం ప్రపంచ సగటు కంటే రెండింతలు ఉండగా, ఏఐ అనువర్తనాల అభివృద్ధిలో వినియోగం 1.8 రెట్లు అధికంగా ఉంది.

డిగ్రీ సరిపోదు.. అందుకే!

ఉద్యోగ మార్కెట్‌లో విజయం సాధించడానికి కేవలం విద్యార్హత సరిపోదని యువతలో ఎక్కువ మంది భావిస్తున్నట్లు ఎమిరిటస్ సర్వే వెల్లడించింది. ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన వారిలో 65 శాతం మంది డిగ్రీ ఒక్కటే ఇక ఉద్యోగ మార్కెట్‌లో విజయం సాధించడానికి సరిపోదని అభిప్రాయపడ్డారు. అయితే ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాల్సిన అవసరం యువతపై ఒత్తిడిని కూడా పెంచుతోంది. సుమారు 60 శాతం మంది నిరంతరం కొత్త నైపుణ్యాలను అభ్యసించాల్సి రావడం వల్ల ఒత్తిడికి, అలసటకు గురవుతున్నామని తెలిపారు. అదే సమయంలో 75 శాతం మంది పోటీని తట్టుకుని నిలవాలంటే సరైన నైపుణ్యాలను నేర్చుకోవడం తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు. ఈ సర్వే ఫలితాలు చూస్తే భారత జెన్-జీ యువతకు ఏఐ కేవలం ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే సాధనంగా మాత్రమే మిగలడం లేదని స్పష్టమవుతోంది. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాన్వేషణ, వృత్తి జీవితానికి సన్నద్ధతలో ఏఐ కీలక భాగంగా మారుతోంది.

# మల్లోజులకు జాబ్

**గడ్చిరోలి గోండ్వానా వర్సిటీలో ఉద్యోగం**

**టెపంరరీ కో ఆర్డినేటర్‌గా నియామకం**

హైదరాబాద్/గడ్చిరోలి, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): మావోయిస్టు పార్టీ అగ్రనేత, మాజీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ (70) అలియాస్ భూపతి/సోనూ మహారాష్ట్రలోని గడ్చిరోలి గోండ్వానా విశ్వవిద్యాలయంలో కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. విశ్వవిద్యాలయంలో భాగంగా ఉన్న 'గ్రామసభల సామర్థ్య పెంపుదల, శిక్షణా కేంద్రం' (సెంటర్ ఆఫ్ పాలసీ రీసెర్చ్ అండ్ అడ్వొకెసీ)లో ఆయన తాత్కాలిక ప్రాతిపదికన గ్రామసభల కోఆర్డినేటర్‌గా ఎంపికయ్యారు. గత ఆగస్టు 11న ఈ ఉద్యోగాలకు ప్రకటన వెలువడగా, పలువురు స్థానిక యువకులతో పాటు మల్లోజుల వేణుగోపాల్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఇంటర్వ్యూల ఆధారంగా మూడు రోజుల కిందట ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదలైంది. ఈ జాబితాలో పేరుండటంతో వేణుగోపాల్ మంగళవారం విశ్వవిద్యాలయానికి వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ అందించారు. యూనివర్సిటీ ప్రకటన ప్రకారం.. కోఆర్డినేటర్‌గా ఎంపికైన అభ్యర్థులు గడ్చిరోలి జిల్లాలోని వివిధ గ్రామాలకు వెళ్లి గ్రామసభల కార్యకలాపాల నిర్వహణను పర్యవేక్షించడమే కాకుండా, పెసా, అటవీ తదితర చట్టాల ద్వారా ఆదివాసులకు లభించిన అధికారాలపై స్థానికులను చైతన్యవంతం చేయనున్నారు. గత అక్టోబర్ 15న తన 60 మందికి పైగా సహచరులతో జనజీవన స్రవంతిలోకి వచ్చిన మల్లోజుల, ఇటీవలే పునరావాస శిబిరం నుంచి విడుదలయ్యారు. 40 ఏళ్లకు పైగా ఆదివాసుల మధ్యే తన జీవితాన్ని గడిపిన ఆయన, ఇకముందు కూడా వారితోనే ఉంటానని ప్రకటించి, ఇప్పుడు తాత్కాలికంగానైనా ఒక ఉద్యోగం సంపాదించడం గమనార్హం. ఈ సందర్భంగా మల్లోజుల వేణుగోపాల్ మాట్లాడుతూ.. 'మా పార్టీ నాయకత్వంలో పెసా అమలులో భాగంగా గ్రామసభల నిర్మాణానికి తెరలేపింది గడ్చిరోలి జిల్లాలోనే. వాస్తవానికి 1996లోనే పెసా పురుడు పోసుకున్నప్పటికీ, మేం 2014-15 వరకు దానిని వ్యతిరేకించి తప్పు చేశాం. కొన్ని ప్రాంతాల్లో 2020 వరకు వ్యతిరేకించి ప్రజలకు చట్టపరమైన ప్రయోజనాలు అందకుండా చేశాం. ఇప్పటికైనా వాటిని రాజ్యాంగబద్ధంగా అమలు చేయడానికి పూనుకోవడం నాకు లభించిన ఒక మంచి అవకాశం'అని పేర్కొన్నారు.

# నీట్ నిరసనల కేసులన్నీ రద్దు

**మొదటి పేజీ తరువాయి**

25 మధ్య ఆందోళనకారులపై నమోదైన అన్ని కేసులను అత్యున్నత న్యాయస్థానం రద్దుచేసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో విద్యార్థులపై దాఖలైన అన్ని కేసులు కొట్టివేయాలని సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 5న తలపెట్టిన మార్చ్‌ను రద్దుచేసినట్టు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రకటించింది. జులై 20న జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా నిరసనకారులపై దాఖలైన కేసులను ఉపసంహరించుకుంటామని, భవిష్యత్తులో అదే నిరసనకు సంబంధించి కొత్త కేసులు నమోదు చేయబోమని కేంద్రం హామీ ఇచ్చిన అనంతరం కోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే, జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొన్న 2,873 మందికి తీవ్రమైన నేర చరిత్ర ఉన్నందున, వారిపై ఒక ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసేందుకు ఢిల్లీ పోలీసులకు కోర్టు అనుమతి ఇచ్చింది. కేంద్రం నుంచి సానుకూల స్పందన, సుప్రీంకోర్టు తీర్పు తర్వాత సెప్టెంబర్ 5న జరగాల్సిన నిరసన పిలుపును ఉపసంహరించుకోవాలని తమ బృందం నిర్ణయించుకున్నట్లు సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ సుప్రీంకోర్టుకు తెలిపారు. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా. విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కేంద్రం, బిహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలు దరఖాస్తులు దాఖలు చేశాయని, అలాగే జులై 20 నుంచి జూలై 25 వరకు జరిగిన నిరసన సంబంధిత సంఘటనలపై భవిష్యత్తులో ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని హామీ ఇచ్చాయని తెలిపారు.

# ఏపీలో సర్ గడువు పెంపు

**మొదటి పేజీ తరువాయి**

ఉన్న పక్షంలో ఈ తేదీలోగా తమ అభ్యంతరాలు దాఖలు చేయవచ్చు. అలాగే అర్హులైనప్పటికీ ఓటర్ లిస్టులో పేరు లేకపోతే సెప్టెంబర్ పదో తేదీలోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసుకునే అవకాశం కల్పించారు. అక్టోబర్ ఐదో తేదీలోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు సమయం ఇచ్చారు. మొత్తం ప్రక్రియ పూర్తి అయిన తర్వాత.. అక్టోబర్ 9న ఓటర్ల తుది జాబితా విడుదల చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సవరించిన షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని సీఈసీ ఆదేశించింది. షెడ్యూల్‌లో మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారిని ఆదేశించింది. వాస్తవానికి అక్టోబర్ మూడో తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించాలని తొలుత భావించారు. అయితే ఏపీ సీఈవో అభ్యర్థన మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సర్ షెడ్యూలులో మార్పులు చేసింది. మరోవైపు సర్ ప్రక్రియ షెడ్యూల్ సవరణ నేపథ్యంలో .. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఓటర్ లిస్టులో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచిస్తున్నారు. పేరులో తప్పులు, అడ్రస్ మార్పులు వంటివి ఉంటే నిర్ణీత గడువులోగా క్లెయిమ్ దాఖలు చేయాలని సూచిస్తున్నారు. మరోవైపు ఏపీలో సర్ ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల సంఘం ఇప్పటికే విడుదల చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 89.22 శాతం మంది, అంటే 3.71 కోట్ల మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. 15.22 లక్షల మంది చనిపోయారని.. 22.30 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారడమో లేదా సర్ ప్రక్రియకు గైర్హాజరు కావడమో జరిగినట్లు వెల్లడించారు.

# ఆర్మీ అడ్డాలో ఆయుధాల చోరీ!

**మొదటి పేజీ తరువాయి**

ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు పిస్తళ్లతో పాటు భారీగా మందుగుండు సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఆర్మీ అధికారులు బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. రక్షణ రంగానికి చెందిన సున్నితమైన అంశం కావడంతో పోలీసులు వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతూ వేగంగా శోధిస్తున్నారు. ఆయుధాల బరువు, పరిమాణం దృష్ట్యా ఈ చోరీలో ఒకరి కంటే ఎక్కువ మంది పాల్గొని ఉంటారని, ఆర్మీ కాంపౌండ్ లోపలి వ్యక్తుల సహకారం ఉందా? అనే కోణంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బందితో పాటు ఇటీవల లోపలికి వచ్చి వెళ్లిన వారి వివరాలు, సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మరోవైపు ఆయుధాలు నిజంగానే చోరీ అయ్యాయా లేక రికార్డుల్లో తేడాల వల్ల మిస్సింగ్‌గా కనిపిస్తున్నాయా? అనే కోణంలోనూ ఆర్మీ స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేస్తున్నారు. ఘటన సమయానికి డ్యూటీలో ఉన్న 12 మంది సెక్యూరిటీ గార్డులను ఎస్ఓటీ, మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆయుధాల రికవరీ కోసం మిలిటరీ అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# హైడ్రా రంగ్‌నాథ్‌కు రిలీఫ్

**మొదటి పేజీ తరువాయి**

కూల్చివేతలకు సంబంధించిన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా.. రంగనాథ్ వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సింగిల్ బెంచ్ ఆయనపై కఠిన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ హైడ్రా వర్గాలు, ప్రభుత్వ లాయర్లు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్.. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌పై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి సమగ్ర విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. డివిజన్ బెంచ్ ఇచ్చిన ఈ స్టేతో హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ తన విధులు కొనసాగించడానికి మార్గం సుగమమైంది.



# కల్యాణలక్ష్మికి ఓకే

**మొదటి పేజీ తరువాయి**

సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# మన దేశం.. మన పైసా!

**మొదటి పేజీ తరువాయి**

ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా భారత్ మాత్రం ఆర్థిక వృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. మనం ఈ వృద్ధి వేగాన్ని ఇలాగే కొనసాగించాలని, ముందుకు సాగుతూనే ఉండాలని తెలిపారు. ఇందుకోసం ఆత్మనిర్భర్ భారత్‌గా మారడం చాలా అవసరమని ప్రధాని పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఛాత్రోం కీ గూంజ్' క్యాంపెయిన్‌పై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమాన్ని ఝూట్ కీ గూంజ్‌గా అభివర్ణించారు.

విదేశీ పెళ్లిళ్లు, బంగారం కొనుగోళ్లు వద్దు

దేశ ప్రజలు స్వదేశీ మంత్రంతో ముందుకు సాగాలని మోదీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియా సంక్షోభం సమయంలో ఇచ్చిన పిలుపునే మరోసారి గుర్తు చేశారు. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లడం మానుకోవాలని సూచించారు. పెళ్లిళ్లు విదేశాల్లో చేసుకోవద్దన్నారు. 'వెడ్ ఇన్ ఇండియా' మంత్రాన్ని ఆచరించాలని సూచించారు. అదేవిధంగా అనవసరంగా బంగారం కూడా కొనుగోలు చేయొద్దని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఈ సందర్భంగా ప్రధాని పిలుపునిచ్చారు. సుస్థిర అభివృద్ధిలో స్వయం సమృద్ధి ముఖ్యమైందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే స్వదేశీ విధానానికి పెద్దపీట వేయాలని నొక్కి చెప్పారు. ఏదైనా వస్తువు కొనుగోలు చేసేటప్పుడు స్వదేశీ వస్తువులకే ప్రాధన్యాత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మనం ఎంత ఎక్కువగా స్థానిక ఉత్పత్తులను, సేవలను ఎంచుకుంటే భారత్ అంతకంతకూ అభివృద్ధి చెందుతుందని అన్నారు. మనం ఆత్మనిర్భరతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగితే.. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని మన యువతకు కానుకగా అందిస్తామనే పూర్తి విశ్వాసం తనకు ఉందని ప్రధాని చెప్పుకొచ్చారు. కాగా, ఇరాన్-అమెరికా యుద్ధ సమయంలోనూ ప్రధాని దేశ ప్రజలకు ఇలాంటి పిలుపే ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మేలో హైదరాబాద్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ.. సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, పెరుగుతున్న ధరలు, ప్రపంచ అనిశ్చితి నుంచి భారత్ గట్టెక్కేందుకు 'సమిష్టి భాగస్వామ్యం' అవసరమని తెలిపారు. సాధ్యమైన చోట వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విదేశీ మారకద్రవ్య నిల్వలపై భారాన్ని తగ్గించేందుకు ఏడాదిపాటూ అనవసరమైన విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో పెళ్లిళ్లు, బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులనే ఎక్కువగా కొనుగోలు చేయాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధి

ఆర్థిక సంవత్సరం 2026-27 తొలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిన విషయం తెలిసిందే. అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రభావం ఆర్థిక కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అంచనాలు ఉన్నప్పటికీ, తొలి త్రైమాసికంలో వృద్ధి బలంగా నమోదైంది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన 8.6 శాతం వృద్ధితో పోలిస్తే తాజా వృద్ధి 80 బేసిస్ పాయింట్లు తగ్గింది.

## వైద్యుడి నిర్లక్ష్యం..
# పీహెచ్‌డీ విద్యార్థి మృతి

**హైదరాబాద్ ఆస్పత్రికి రూ. కోటి జరిమానా**

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ పీహెచ్‌డీ విద్యార్థి మృతి చెందాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కన్జూమర్ డిస్ప్యూట్స్ రెడ్రెస్సల్ కమిషన్‌ను సంప్రదించారు. ఈ కేసు విచారణ అనంతరం మృతుడి కుటుంబానికి రూ. కోటి చెల్లించాలని సదరు ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆదేశించింది. లీగల్ ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి మరో రూ. 50 వేలు చెల్లించాలని ఆదేశించింది. సూర్య ప్రతాప్ భారతి(30) అనే విద్యార్థి హైదరాబాద్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. అయితే అతనికి 2020 ఆగస్టు 17న తీవ్రమైన స్ట్రోక్ వచ్చింది. దీంతో పక్షవాతానికి గురయ్యాడు. యూనివర్సిటీ హాస్టల్ సిబ్బంది తక్షణమే భారతిని సిటిజెన్స్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. అయితే భారతికి అత్యవసరంగా మెకానికల్ థ్రాంబెక్టోమీ అవసరం. కానీ న్యూరాలజిస్ట్ ఆ మేరకు చికిత్స అందించడంలో పూర్తిగా విఫలమయ్యాడు. ఆస్పత్రి యాజమాన్యం కూడా పట్టించుకోలేదు. కోమాలో ఉన్న భారతి నాలుగు రోజులకు ప్రాణాలు కోల్పోయాడు. భారతి కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో వారి నుంచి ఎలాంటి సమ్మతి తీసుకోలేనందున వైద్యం సకాలంలో అందించలేకపోయామని ఆస్పత్రి యాజమాన్యంతో పాటు సదరు న్యూరాలజిస్ట్ వినియోగదారుల ఫోరానికి విన్నవిస్తూ కుటుంబ సభ్యులపైనే నెపం నెట్టారు. అత్యవసర చికిత్స అందించడం ఆస్పత్రి కర్తవ్యమని వినియోగదారుల ఫోరం అభిప్రాయపడింది. భారతి మరణానికి పూర్తిగా ఆస్పత్రితో పాటు న్యూరాలజిస్ట్ నిర్లక్ష్యమేనని వినియోగదారుల ఫోరం విచారణలో తేలింది. దీంతో ఆస్పత్రి యాజమాన్యం, న్యూరాలజిస్ట్ కలిసి భారతి కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. లీగల్ ఖర్చుల నిమిత్తం మరో రూ. 50 వేలు చెల్లించాలని ఆదేశించింది. నిర్ణీత గడువులోగా పరిహారం చెల్లించకపోతే.. ఆ రోజు నుంచి చెల్లించే వరకు ఏడాదికి 9 శాతం వడ్డీ చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ వర్సిటీల క్యాంపస్‌లు

**భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు**

**గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు**

**హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి**

**సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్‌లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

## ఎంపీ లాడ్స్ నిధులపై
# తప్పుడు ఆరోపణలు

**ఎంపవర్డ్ ఇండియన్ సర్వేపై బండి సంజయ్ ఫైర్**



కరీంనగర్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

# వచ్చేది బీఆర్ఎస్సే

## కేసీఆర్ ప్రజల్లోకి వస్తేనే మద్దతు.. కారుకు 3.4% శాతం పెరిగిన గ్రాఫ్

## కాంగ్రెస్‌పై తీవ్ర అసంతృప్తి.. జెన్ జీకి దగ్గరైనవారికే 2028 పీఠం

**ప్రస్తుతానికి ఎటూ మొగ్గు చూపని జెన్ జీ**

**కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చాణక్య స్ట్రాటజీస్ సర్వే**



న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తైన సందర్భంగా చాణక్య స్ట్రాటజీస్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా జనం నాడీ పట్టుకునేందుకు సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా జూలై నుంచి ఆగస్టు మధ్య ప్రతి నియోజకవర్గాల్లో 800 నుంచి 1000 మందితో మాట్లాడి మొత్తం 1,06, 820 శాంపుల్స్ సేకరించారు.ఒక్కో గ్రామ పంచాయితీలో 10 నుంచి 20 మందిని సంప్రదించారు. ఈ సర్వే నివేదిక ప్రకారం.. 37.1 శాతం(39,630 మంది) కాంగ్రెస్ వైపు, 40.7 శాతం (43,530 మంది) బీఆర్ ఎస్ వైపు, 14.1 శాతం (15,030 మంది) బీజేపీ వైపు మొగ్గు చూపారు. మరో 8.1 శాతం(8620 మంది) ఎటూ మొగ్గు చూపలేదు. అయితే, కాంగ్రెస్ సర్కారుపై వ్యతిరేకత బాగా పెరిగింది. ఆ పార్టీ పై జెన్ జీ అసంతృప్తితో ఉన్నారు. బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగింది. బీజేపీ ఇంకా కోలుకోలేదు. బీఆర్ఎస్ సోషల్ మీడియా సక్సెస్ అయ్యింది. కాంగ్రెస్ సోషల్ మీడియా ఫ్లాప్ అయ్యింది. 51 శాతం ప్రజలు కేసీఆర్ పాలనే బాగుందని చెప్పారు. చాణక్య సర్వే నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. 2023 శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 39.4 శాతం ఓట్లు పడ్డాయి ప్రస్తుత సర్వేలో ఆ గ్రాఫ్ -2.3% తేడాతో 37.1 శాతానికి పడిపోయింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ప్రజలు భావిస్తున్నారు. రోజు రోజుకూ జాప్యం అవుతున్నది. తమకు ఇస్తామన్న 2500 పెన్షన్ ఎన్నికల ముందు ఇచ్చినా సరే..ఓటు వేయమని ప్రజలు కచ్చితంగా చెబుతున్నారు. మరోవైపు గ్రామ పంచాయితీల్లో, మున్సిపాలిటీల్లో పాలనకు సంబంధించి ఎటువంటి కొత్త మార్పు చోటు చేసుకోలేదు. నెగెటివ్ వేవ్ ఏర్పడి ఉంది. మరో 800 రోజుల్లో సరిచేసుకోకపోతే కష్టమే.

**బీఆర్ఎస్ వైపు మొగ్గు..కానీ**

2023 ఎన్నికల్లో బీఆర్ ఎస్ కు 37.3 శాతం ఓట్లు పడ్డాయి. ఇప్పటి సర్వేలో ఆ పార్టీ గ్రాఫ్ పెరిగింది. 3.4 శాతం అదనపు ఓట్లతో ప్రజల్లో నమ్మకం పెంచుకోగలిగింది. అయితే కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకతను బీఆర్ ఎస్ ఇంకా అందిపుచ్చుకోవడం లేదు. కాంగ్రెస్ పై తీవ్ర వ్యతిరేకత ప్రదర్శిస్తున్న జెన్ జీలు ప్రత్యామ్నాయంగా బీఆర్ ఎస్ వైపు చూస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో క్యాడర్ పునర్నిర్మాణం జరగకపోవడం వల్ల.. అది సాధ్యపడడం లేదు. 2023 ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చి ఉంటే బీఆర్ ఎస్ ఓడిపోయి ఉండేది కాదు. ఓటమికి కారణం కేసీఆర్ కాదు. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులే. అయితే ఇప్పటికీ బీఆర్ ఎస్ పుంజుకోకపోవడానికి కారణం..ప్రజల్లో వ్యతిరేకత మూట గట్టుకుని ఓడిపోయిన అభ్యర్థులే..ఇంకా ఇప్పటికీ ఇన్ చార్జులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతానికైతే జెన్ జీలు ఇంకా బీఆర్ ఎస్ వైపు మొగ్గు చూపడం లేదు. అయితే.. కేసీఆర్ ప్రజల్లోకి వస్తే ..ఆయనకు మళ్లీ ఓటు వేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పలు ప్రాంతాల్లో స్పందనలు వచ్చాయి.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్‌దే**

రానున్న ఖమ్మం నల్లగొండ వరంగల్ నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరులో బీఆర్ ఎస్ బలంగా కనిపిస్తున్నది. 34 నియోజకవర్గాల్లో సర్వే జరిగింది. ఎవరికి ఓటేస్తారని అడిగిన ప్రశ్నకు బీఆర్ ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి వైపు మొగ్గు చూపారు. వరంగల్ ఉమ్మడి జిల్లా అంతా రాకేశ్ రెడ్డి వైపు ఏక పక్షంగా ఉంది. ఖమ్మంలో సత్తుపల్లి, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాలను మినహాయిస్తే.. మిగిలిన నియోజకవర్గాలన్నీ బీఆర్ ఎస్ కే అనుకూలంగా ఉన్నాయి. నల్లగొండలోని ఆలేరు, భువనగిరి, నాగార్జున సాగర్, మిర్యాలగూడ, నల్లగొండ పట్టణంలో బీఆర్ ఎస్ బలంగా ఉంటే మిగిలిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలంగా ఉంది. ఈ గణాంకాలను కలిపితే.. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేశ్ రెడ్డికే విజయ అవకాశాలు బలంగా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపాలిటీ, సైబరాబాద్ మున్సిపాలిటీల్లో ని 74 డివిజన్లలో 48 నుంచి 50 సీట్లు బీఆర్ ఎస్. చివరి సారి ఎన్నికల్లో ఎల్బీనగర్ లో బీజేపీ కి అన్ని సీట్లు వచ్చాయి. ఈ సారి అక్కడ బీఆర్ ఎస్ వైపు ఓటర్లు మొగ్గు చూపుతున్నారు. అక్కడ 18 డివిజన్లలో 15 బీఆర్ ఎస్ కే వస్తున్నాయి. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో 16లో బీఆర్ ఎస్ కు 8 కాంగ్రెస్ కు 7 డివిజన్లు బీజేపీకి 1 డివిజన్ దక్కుతున్నాయి. ఉప్పల్ లో బీఆర్ ఎస్ ,బీజేపీల మధ్య పోటీ ఉంది. మల్కాజిగిరిలో బీజేపీ, బీఆర్ ఎస్, కాంగ్రెస్ ల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్నది. సైబరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శేరిలింగంపల్లిలోని 15 డివిజన్లలో 10 చోట్ల బీఆర్ ఎస్, 4 చోట్ల కాంగ్రెస్, ఒక చోట బీజేపీ బలంగా ఉన్నాయి. పటాన్ చెరులో బీఆర్ ఎస్ పూర్తి బలంగా ఉంది. కాగా, హైదరాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ.. ఎంఐఎంతో కలిసి పోటీ చేసే పరిస్థితి ఉన్నందున ఆ మున్సిపాలిటీ కాంగ్రెస్ కే దక్కొచ్చు. ఇక, బీజేపీ పరిస్థితి 2023 నుంచి ఇప్పటి వరకు ఓటింగ్ శాతంలో పెద్దగా మార్పు కనబడలేదు. గత శాసనసభ ఎన్నికల్లో 13.9గా ఉన్న ఓటింగ్ శాతం ఇప్పుడు అతి స్వల్పంగా పెరిగి 14.1 గా నమోదైంది. అయితే ఒకవేళ బీజేపీ ..బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటిస్తే.. కొన్ని స్థానాల్లో స్వల్ప మెజారిటీతో మరిన్ని సీట్లు దక్కించుకొని కింగ్ మేకర్ గా మారి.. ప్రభుత్వ ఏర్పాటు లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. కవిత పార్టీ పై కూడా ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. పార్టీ పెట్టి తండ్రికి వ్యతిరేకంగా వెళుతున్నారని.. వ్యక్తిగత విమర్శలు ఎక్కువయ్యాయని ముఖ్యంగా హరీశ్ రావు మీద విమర్శలు చేస్తున్నారు కానీ ప్రజా సమస్యలపై మాట్లాడింది తక్కువని అభిప్రాయం వ్యక్తం చేశారు. నిజంగా ప్రజా సమస్యల కోసమే పార్టీ పెట్టారా? లేక వేరే ఎవరైనా పార్టీ పెట్టించారా? అనే అనుమానాలు కూడా వ్యక్తం చేశారు.

# తండ్రినే తిట్టినవ్.. నేనోలెక్కా!

## కేసీఆర్ మనోవేదనకు గురైతుండు.. కవితపై ప్రశాంత్ రెడ్డి మండిపాటు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలపై బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనపై కవిత చేసిన వ్యాఖ్యలను ఖండించిన ప్రశాంత్ రెడ్డి.. తన రాజకీయ ప్రస్థానం, బీఆర్ఎస్‌తో ఉన్న అనుబంధం, కేసీఆర్ కుటుంబంతో తన సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కల్వకుంట్ల కవిత వల్ల ఆమె తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఒక్కసారైనా ఆలోచించుకోవాలని ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలపై స్పందించిన ప్రశాంత్ రెడ్డి.. కేసీఆర్, కేటీఆర్, కవిత మధ్య విభేదాలను పరిష్కరించేందుకు తాను ప్రయత్నించానని గుర్తు చేసుకున్నారు. వారిని విడదీయడానికి తాను ఎప్పుడూ ప్రయత్నించలేదని స్పష్టం చేశారు. తాను ఏం చేశానో కేసీఆర్‌కు పూర్తిగా తెలుసని పేర్కొన్నారు. పార్టీ లైన్ దాటిన తర్వాతే.. కవితపై బీఆర్ఎస్ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. తనపై వ్యక్తిగతంగా కవిత నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. స్వలాభం కోసం ఇతరుల ప్రతిష్టకు భంగం కలిగించేలా మాట్లాడటం మంచిది కాదని హితవు పలికారు. తనపై చేసిన ఆరోపణలకు కవిత ఆధారాలు చూపించాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్‌తో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావించిన ప్రశాంత్ రెడ్డి.. తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి, తాను తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ఆవిర్భావానికి ముందే ఉద్యమ రాజకీయాల్లో ఉన్నామని తెలిపారు. పార్టీ ప్రారంభ దశ నుంచి తమ కుటుంబం బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ అంటే ప్రశాంత్ రెడ్డి.. ప్రశాంత్ రెడ్డి అంటే బీఆర్ఎస్ అంటూ వ్యాఖ్యానించారు. కవిత మధ్యలోనే పార్టీలోకి వచ్చారని.. ఇప్పుడు మధ్యలోనే వెళ్లిపోయారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమం, పార్టీ నిర్మాణంలో తమ కుటుంబం పోషించిన పాత్రను గుర్తు చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కేసీఆర్‌కు అండగా ఎవరు నిలుస్తున్నారో కవిత తెలుసుకోవాలని ప్రశాంత్ రెడ్డి సూచించారు. అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని గుర్తు చేశారు. మరీ ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి విధానాలపై బీఆర్ఎస్ తరఫున తాము నిరంతరం పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ నేతలతో రహస్యంగా మంతనాలు జరుపుతున్నానని కవిత చేసిన ఆరోపణలను కూడా ప్రశాంత్ రెడ్డి ఖండించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉన్న తాను ఎవరితోనూ అలాంటి చర్చలు జరపలేదని ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో కవిత కాంగ్రెస్ నాయకులతో రహస్యంగా సమావేశాలు నిర్వహించలేదని చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్‌కు సన్నిహితంగా ఉన్న నాయకులను కవిత టార్గెట్ చేస్తున్నారని ఆరోపించిన ప్రశాంత్ రెడ్డి.. ఇలా చేయడం ద్వారా బీఆర్ఎస్ నాయకత్వాన్ని బలహీనపరిచే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. అది పరోక్షంగా అధికార కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూరుతోందని విమర్శించారు. అయితే తాను ఎవరినీ విడదీయడానికి ప్రయత్నించలేదని మరోసారి స్పష్టం చేశారు.

# శ్రీవారి భక్తులు జాగ్రత్త.. 249 నకిలీ వెబ్‌సైట్లు



తిరుమల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): నకిలీ వెబ్‌సైట్ల గురించి తిరుమల శ్రీవారి భక్తులను టీటీడీ మరోసారి అప్రమత్తం చేసింది. గదుల కేటాయింపు పేరుతో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తూ.. పోస్టర్లు, తప్పుడు హామీలతో భక్తులను మోసం చేస్తున్న 249 నకిలీ వెబ్‌సైట్‌లను ఈ సంవత్సరం ఇప్పటివరకు గుర్తించినట్లు టీటీడీ తెలిపింది. ఆ ఫేక్ వెబ్‌సైట్లను తొలగించామని.. రెండు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపింది. ఆన్‌లైన్‌లో టీటీడీ పేరుతో కనిపించే నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భక్తులను హెచ్చరించింది. శ్రీవారి దర్శనం, వసతి, సేవలు, టోకెన్ల విషయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని.. తిరుమలకు సంబంధించిన అన్ని సేవలు, నిబంధనలు, మార్గదర్శకాలపై అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. దర్శనం, గదుల కేటాయింపు అంటూ మోసాలకు పాల్పడుతున్న దళారులపై ఈ ఏడాది ఇప్పటివరకు 30 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు టీటీడీ వెల్లడించింది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన 43 మంది టీటీడీ ఉద్యోగులపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. తిరుమలకు వచ్చే భక్తులు తమ సూచనలు, నిబంధనలు పాటిస్తూ.. భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవాలని సూచించింది. ఇక తిరుమలకు వచ్చే వెంకన్న భక్తులు తమ వెంట తీసుకువచ్చే వస్తువులపైనా టీటీడీ కీలక సూచనలు చేసింది. తిరుమలకు వచ్చే వాహనాల్లో నిషేధిత వస్తువులను తరలించకుండా అలిపిరి, శ్రీవారిమెట్టు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు టీటీడీ తెలిపింది. నిషేధిత వస్తువులను గుర్తిస్తే.. అలిపిరి టోల్‌గేట్ స్కానింగ్ కేంద్రం వద్దనే సీజ్ చేస్తున్నట్లు తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు అలిపిరి వద్ద 261 డ్రోన్లు, 105 మెటా స్మార్ట్ గ్లాసెస్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు టీటీడీ వెల్లడించింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



# నైట్ బస్సులు షురూ!

**6 రూట్లలో ఆర్టీసీ నైట్ సర్వీసులు.. డిమాండ్‌ను బట్టి విస్తరణకు ప్రణాళిక**

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): నైట్ బస్సులు ప్రారంభమయ్యాయి. మంగళవారం (సెప్టెంబర్ 1) నుంచి ఆరు ప్రధాన మార్గాల్లో సర్వీసులను ఆర్టీసీ పునఃప్రారంభించింది. రాత్రి 10 లేదా 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఈ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్ ఈ వివరాలను వెల్లడించారు. ఐటీ కారిడార్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను కలుపుతూ మొత్తం 15 బస్సులతో ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చే స్పందన, డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని ఆయన వివరించారు. గతంలో 'నైట్ రైడర్స్' పేరుతో ఆర్టీసీ ఇలాంటి సర్వీసులను నడిపినప్పటికీ, ఆక్యుపెన్సీ తక్కువగా ఉండటంతో వాటిని నిలిపివేసింది. అయితే, ప్రస్తుతం నగరంలో రాత్రి షిఫ్టుల్లో పనిచేసే ఉద్యోగులు, ముఖ్యంగా ఐటీ, హాస్పిటాలిటీ రంగాల సిబ్బంది, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సర్వీసులను మళ్లీ ప్రారంభించారు.

**ప్రస్తుతం నడిచే ఆరు రూట్ల వివరాలు**

**222ఏ:** కోఠి నుంచి పటాన్‌చెరు (అబిడ్స్, లక్డీకాపూల్, కొండాపూర్ మీదుగా) – ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు

**218:** అఫ్జల్‌గంజ్/సీబీఎస్ నుంచి పటాన్‌చెరు (కోఠి, కేపీహెచ్‌బీ, మియాపూర్ మీదుగా)

**219:** సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరు (ప్యారడైజ్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ మీదుగా)

**290యూ:** హయత్‌నగర్ నుంచి సికింద్రాబాద్ (ఎల్‌బీ నగర్, నాగోల్, తార్నాక మీదుగా)

**195డబ్ల్యూ:** బాచుపల్లి నుంచి వేవ్‌రాక్ (ఐటీ క్యాంపస్‌ల మీదుగా)

**10హెచ్:** కొండాపూర్ నుంచి సికింద్రాబాద్

# పులివెందులలో జగన్‌కు ఘనస్వాగతం

పులివెందుల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం పులివెందులకు చేరుకున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో సాగనున్న ఈ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయన పులివెందుల చేరుకోగా... హెలిప్యాడ్ వద్ద పార్టీ నాయకులు, స్థానిక శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా జగన్ భాకరాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. సొంత నియోజకవర్గం పులివెందులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ రాత్రికి ఆయన పులివెందులలోని తన స్వగృహంలోనే బస చేయనున్నారు. బుధవారం ఉదయం 7.45 గంటలకు జగన్ ఇడుపులపాయకు బయల్దేరి వెళతారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, నివాళులు అర్పిస్తారు.



## కొండగట్టులో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

**లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు.. అన్నప్రసాద వితరణ**

మల్యాల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మెగా యూత్ ఫోర్స్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కాస రాజు ఆధ్వర్యంలో లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుడు గడల శ్రీనివాస్, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్య హాజరయ్యారు. పవన్ కల్యాణ్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ పి. రామకృష్ణగౌడ్, జనసేన రాష్ట్ర నాయకులు రాము యాదవ్, శ్రీరాముల సోమశేఖర్, శ్రీదేవి, మిర్యాల రామకృష్ణ, డాక్టర్ రాజ్‌కిరణ్, బేకం జనార్దన్‌తో పాటు మెగా అభిమాన సంఘాల నాయకులు, ఉమ్మడి జిల్లాకు చెందిన జనసేన నాయకులు పాల్గొన్నారు.



## కోరుట్లలో పద్మశాలి సంఘ భవనం ప్రారంభం

కోరుట్ల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కోనరావుపేట రోడ్డులో నూతనంగా నిర్మించిన పద్మశాలి సంఘ భవనాన్ని జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, నాయకులు వారికి స్వాగతం పలికారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌కు ఏబీవీపీ వినతి**

జగిత్యాల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుతున్నారని తెలిపారు. ప్రస్తుతం సుమారు రూ.12 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, కళాశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది సుమారు 2 లక్షల మంది విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని, మరో 4.5 లక్షల మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బకాయిల విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాపాక నిఖిల్, జోనల్ ఇన్‌చార్జి అభిషేక్, విగ్నేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

**టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నిరసన**

జగిత్యాల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, కన్వీనర్ కందుకూరు రవిబాబు తదితరులు మాట్లాడుతూ పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, హెల్త్‌కార్డులను పటిష్ఠంగా అమలు చేయాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 10న నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పునరుద్ధరించాలి

**నల్ల బ్యాడ్జీలతో సిరిసిల్ల కలెక్టరేట్‌లో నిరసన**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): నూతన పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ప్రాంగణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఎలుసాని ప్రవీణ్‌కుమార్, కన్వీనర్ సయ్యద్ జబీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొని సీపీఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. తాము కొత్తగా ఎలాంటి డిమాండ్లు చేయడం లేదని, ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, రూ.10 వేల కోట్ల బకాయిలు, నూతన వేతన సవరణ సంఘం, ఆరోగ్య కార్డులు తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 10న 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. నిరసన అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ జి. నగేష్‌కు ఉద్యోగ సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయుల సంఘం, కలెక్టరేట్ ఉద్యోగుల సంఘం, పెన్షనర్ల సంఘం తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఉత్తరాఖండ్ జర్నలిస్టుల పర్యటన

**కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై క్షేత్రస్థాయి పరిశీలన**



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (పీఐబీ): తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు హైదరాబాద్ నగర సుసంపన్న సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన 15 మంది పాత్రికేయుల బృందం హైదరాబాద్ పర్యటనకు వచ్చింది. డెహ్రాడూన్ పత్రికా సమాచార సంస్థ (పీఐబీ) సహాయ సంచాలకుడు సంజీవ్ సుంద్రియాల్ నేతృత్వంలోని ఈ బృందం ఆగస్టు 31న నగరానికి చేరుకుంది. సెప్టెంబరు 4 వరకు వివిధ ప్రాంతాలను సందర్శించనుంది. ఐదు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయంలో పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, సంయుక్త సంచాలకుడు డాక్టర్ మానస్ కృష్ణకాంత్‌తో పాటు ఇతర అధికారులతో పాత్రికేయుల బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలోని మీడియా రంగం పరిణామాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రధాన పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు సమాచారం అందించేందుకు పీఐబీ, కేంద్ర సమాచార విభాగం చేపడుతున్న విస్తృత సమాచార, ప్రచార కార్యక్రమాలను శ్రుతి పాటిల్ వివరించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర వార్తా కథనాలను రూపొందించేందుకు పీఐబీ నిర్వహించే క్షేత్రస్థాయి పర్యటనలు, కార్యక్రమాల్లో పాత్రికేయుల భాగస్వామ్యం ప్రాధాన్యాన్ని ఆమె వివరించారు. హైదరాబాద్ పర్యటనలో తాము తెలుసుకున్న అంశాలను ఉత్తరాఖండ్ ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కోరారు. తెలంగాణపై ఉత్తరాఖండ్ ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో పాత్రికేయులు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రాన్ని (ఇన్‌కాయిస్) పాత్రికేయుల బృందం సందర్శించింది. సముద్ర పరిస్థితుల పర్యవేక్షణ, సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ, సముద్ర పరిస్థితుల అంచనాలు, హెచ్చరికల జారీ తదితర సముద్ర సమాచార సేవల్లో భారతదేశం సాధించిన సామర్థ్యాన్ని అక్కడి అధికారులు పాత్రికేయులకు వివరించారు. పర్యటనలో భాగంగా భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్), కార్మిక--ఉపాధి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ (ఈఎస్ఐసీ) ఆసుపత్రిని కూడా పాత్రికేయుల బృందం సందర్శించనుంది. ఈ సందర్శనల ద్వారా పోషకాహార పరిశోధనలు, ప్రజారోగ్య చర్యలు, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం కింద అందుతున్న ఆరోగ్య సంరక్షణ సేవలపై బృందానికి అవగాహన కలగనుంది. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చేనేత, చేతివృత్తులకు సంబంధించిన ప్రదర్శనను కూడా పాత్రికేయుల బృందం సందర్శించనుంది. హైదరాబాద్ నగర సుసంపన్న సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, లాడ్ బజార్ తదితర ప్రముఖ చారిత్రక ప్రదేశాలను కూడా పాత్రికేయుల బృందం సందర్శించనుంది.

# ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే దేశ నిర్మాణం

**విద్యార్థులు పోషకాహార అవగాహనకు క్రియాశీల కార్యకర్తలుగా మారాలి.. పోషణ మాసోత్సవం-2026 ప్రారంభోత్సవంలో ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్**




హైదరాబాద్, సెప్టెంబర్ 1 (పీఐబీ): ఆరోగ్యవంతమైన, దృఢమైన చిన్నారులతోనే బలమైన భారతదేశాన్ని నిర్మించగలమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర సమాచార విభాగం (సీబీసీ) ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం-2026పై ఏర్పాటు చేసిన సమగ్ర సమాచార, ప్రజా అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం హైదరాబాద్ గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాల ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రదర్శనను ఏర్పాటు చేసిన సీబీసీని డాక్టర్ లక్ష్మణ్ అభినందించారు. ఈ ప్రదర్శన సమాచారాన్ని అందించడంతోపాటు ఆలోచనలను రేకెత్తించే అంశాలతో ఆకట్టుకుంటోందని, తనకు కూడా కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. "దేశ నిర్మాణమంటే ఇటుకలు, సిమెంటు, ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రితో కట్టడాలు నిర్మించడం మాత్రమే కాదు. చిన్నారులను ఆరోగ్యవంతులుగా, దృఢంగా తీర్చిదిద్దడమే నిజమైన దేశ నిర్మాణం. దృఢమైన చిన్నారులతోనే దృఢమైన, ఆరోగ్యవంతమైన భారత్ రూపుదిద్దుకుంటుంది" అని ఆయన అన్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత క్రియాశీల కార్యకర్తలుగా, భాగస్వాములుగా మారాలని డాక్టర్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సరైన పోషకాహారంపై తల్లిదండ్రులు, చిన్నారులతోపాటు ముఖ్యంగా సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇలాంటి ప్రజా అవగాహన కార్యక్రమాలను విద్యార్థులు ప్రాజెక్టులుగా చేపట్టేలా కళాశాల యాజమాన్యాలు ప్రోత్సహించాలని కోరారు. రక్తహీనత, తక్కువ బరువు, అధిక బరువు, ఊబకాయం, వయసుకు తగ్గ శారీరక ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విధానాల ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు, సుమారు 9 కోట్ల మంది చిన్నారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. దేశంలోని 11 లక్షలకు పైగా పాఠశాలల్లో దాదాపు 12 కోట్ల మంది చిన్నారులకు ప్రతిరోజూ వేడిగా వండిన భోజనం అందుతోందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని కూడా ఆయన వివరించారు. తెలంగాణలో వయసుకు తగ్గ శారీరక ఎదుగుదల లేని చిన్నారుల నిష్పత్తి 33 శాతం నుంచి 27 శాతానికి తగ్గిందని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల కృషి, ప్రభుత్వ సహకారంతోనే ఈ పురోగతి సాధ్యమైందని పేర్కొన్నారు. చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహార పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని డాక్టర్ లక్ష్మణ్ నొక్కిచెప్పారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. చిరుధాన్యాల్లోని పోషక విలువలు, చిన్న, వర్షాధార రైతులకు వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన చిరుధాన్య ఆధారిత పోషకాహార ఉత్పత్తులను తయారు చేస్తున్నవారిని ఆయన అభినందించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు, వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు. పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. పోషకాహారమంటే కేవలం ఆహారం మాత్రమే కాదని, అది ఆరోగ్యం, ఉత్పాదకత, అభ్యాస సామర్థ్యం, జీవన నాణ్యతతో ముడిపడి ఉందని అన్నారు. ప్రదర్శనలు, ఒగ్గుకథ, యక్షగానం వంటి సంప్రదాయ జానపద కళారూపాల ద్వారా విశ్వసనీయమైన పోషకాహార సందేశాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో కేంద్ర సమాచార విభాగం పోషిస్తున్న పాత్రను వివరించారు. పోషకాహారంపై అవగాహనను ఆరోగ్యకరమైన జీవన అలవాట్లుగా మార్చి, మరింత ఆరోగ్యవంతమైన, బలమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడటమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఏవీ విద్యా సంస్థల కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ రెడ్డి, ఏవీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ, పీఐబీ, సీబీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల సందడి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాలైన శ్రీ బద్ది పోచమ్మ, గ్రామదేవత శీతలాదేవి ఆలయాల్లో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. మంగళవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా భక్తులు అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీర--సారె, బెల్లం సాకలు, పట్నాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, తాగునీరు, ప్రసాద వితరణ తదితర ఏర్పాట్లను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి నాగుల మహేష్ పర్యవేక్షించారు. ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ ఈ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకురాలు వెంకటలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భీమన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబునాయక్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు భీమేశ్వర వసతిగృహం వద్దకు చేరుకున్న కమిషన్ చైర్మన్‌కు పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న చైర్మన్, సభ్యులకు అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి ప్రతాప నవీన్‌కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ వీరప్రసాద్, పీఆర్వో పెరుక శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, నరేందర్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీటెక్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అడ్డుకోవాలి

**ఎంవీఎస్ఆర్ కళాశాలలో బీ-కేటగిరీ సీట్లపై విచారణ జరపాలి: డప్పు గోపి**

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, విరాళాలు, ఇతర రుసుముల పేరుతో జరుగుతున్న వసూళ్లపై ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి జన సమితి రాష్ట్ర నాయకుడు డప్పు గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డిని కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డప్పు గోపి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండాల్సిన సమయంలో కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల భారం తీవ్రంగా పెరుగుతోందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ప్రత్యేకంగా ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ-కేటగిరీ సీట్లకు సంబంధించి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని అన్నారు. బీ-కేటగిరీ సీట్ల కేటాయింపు, ఫీజుల వసూళ్లు, ప్రవేశాల ప్రక్రియ తదితర అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక రూపొందించాలని కోరారు. ఏ కేటగిరీ విద్యార్థి అయినా అన్యాయానికి గురికాకుండా మెరిట్, నిబంధనలు, పారదర్శకత ఆధారంగా ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బీ-కేటగిరీ సీట్లు, ఫీజుల వసూళ్లు, విరాళాలు, ఇతర రుసుములపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను సహించేది లేదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతుందని డప్పు గోపి స్పష్టం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి జన సమితి నాయకులు పాల్గొన్నారు.

## పద్మశాలి నూతన కార్యవర్గం ఎన్నిక



మల్యాల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని లంబాడిపల్లి గ్రామ పద్మశాలి కుల సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా వేముల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా పెంట శ్రీధర్, కోశాధికారిగా వేముల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా పెంట రమేష్, సహాయ కార్యదర్శిగా వేముల సతీష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వేముల ప్రభాకర్, పెంట ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెంట సుధాకర్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పద్మశాలి కుల సంఘ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అన్నవరంలో భోగ శ్రావణి దంపతుల పూజలు

కాకినాడ/అన్నవరం, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): అన్నవరం, లో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి ప్రవీణ్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారిని మంగళవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి నిరంతరం కొనసాగాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు.

## సైదాబాద్ వంతెనకు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

**రౌండ్‌టేబుల్ సమావేశంలో సామాజిక సంఘాల డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ తొలితరం ఉద్యమనేత సంగం లక్ష్మీబాయి సేవలను గుర్తించి సైదాబాద్ ఉక్కు వంతెనకు ఆమె పేరు పెట్టాలని పలువురు వక్తలు, సామాజిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు, తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ వ్యవస్థాపకుడు వినయ్‌కుమార్ యాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనను, బ్రిటిష్ పాలనను ఎదిరించి జైలు జీవితం గడిపిన ధీరవనిత సంగం లక్ష్మీబాయి అని కొనియాడారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న ఆమె ఆచార్య వినోబా భావేతో కలిసి భూదాన ఉద్యమంలోనూ పనిచేశారని గుర్తుచేశారు. అణగారిన వర్గాలు, వితంతు మహిళల అభ్యున్నతి కోసం 'ఇందిరా సేవా సదన్', విద్యార్థుల కోసం విద్యాపీఠాన్ని ఏర్పాటు చేసిన మహనీయురాలని పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, ఉప విద్యాశాఖ మంత్రిగా, అనంతరం మూడుసార్లు లోక్‌సభ సభ్యురాలిగా సేవలందించిన సంగం లక్ష్మీబాయి చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సైదాబాద్ ఉక్కు వంతెనకు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టడంతో పాటు రాష్ట్ర సచివాలయం లేదా శాసనసభ ప్రాంగణంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీసీ, బహుజన, సామాజిక సంఘాలను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, మాస్ అధికార ప్రతినిధి మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర, ఉపాధ్యక్షురాలు దుర్గారాణి రజక, బీసీ ఉద్యమకారుడు ఒట్టె జానయ్య యాదవ్, బొంగు ప్రసాద్ గౌడ్, చామకూర రాజు, పృధ్వీరాజ్ యాదవ్, నీరజాగౌడ్, శ్రీనివాస్ యాదవ్, గోపీ రజక, కైరంకొండ నర్సింగ్‌రావు, తాడెం రమేష్‌కుమార్, తొలివెలుగు రఘు, కాలోజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ వ్యాఖ్యలు కుసంస్కారం

**సీఎంపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఫైర్**

చొప్పదండి, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్రంగా ఖండించారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయిలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, ఆయన హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు, కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగాలు, రైతు రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు తులం బంగారం వంటి హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రశ్నించబోతుందనే భయంతోనే సీఎం అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని రవిశంకర్ అన్నారు.

# ఉగ్రవాదంపై రెండు మాటలొద్దు!

## టెర్రర్ దేశాలపై కఠినంగా ఉండాలి.. షాంఘై శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

బిష్కెక్: ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ఈ అంశంలో ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదని స్పష్టం చేశారు. కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై ప్రపంచానికి గట్టి సందేశం ఇచ్చారు. ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న విధానంలో ఎలాంటి మార్పు లేదని ప్రధాని మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మలుచుకున్న దేశాలకు స్పష్టమైన, కఠినమైన సందేశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి తీవ్రమైన అంశంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని.. అందరిదీ ఒకే మాట ఉండాలని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఒక విధానపరమైన సాధనంగా వాడుకుంటున్న, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇస్తున్న దేశాలకు గట్టి హెచ్చరికలు పంపాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక సంపదగా మారకూడదని స్పష్టం చేశారు. నేటి అనుసంధానిత ప్రపంచంలో భద్రతా పరిధి మరింత విస్తృతమైందని ప్రధాని తెలిపారు. ఇందుకు పశ్చిమాసియా సంక్షోభాన్ని ఒక ఉదాహరణగా చెప్పారు. ఆ ప్రాంతంలో మొదలైన సంఘర్షణ కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాలేదని గుర్తు చేశారు. దాని ప్రభావం ప్రపంచ ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసులన్నింటిపై పడుతోందని వివరించారు. ఇలాంటి సంఘర్షణల వల్ల గ్లోబల్ సౌత్ దేశాలు అత్యధిక మూల్యం చెల్లిస్తున్నాయని చెప్పారు. అందుకే అన్ని యుద్ధాలు, ఉద్రిక్తతలను యుద్ధభూమిలో కాకుండా చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలన్న భారత వైఖరిని పునరుద్ఘాటించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా యువతకు, ప్రాంతీయ భద్రతకు పెను ముప్పుగా మారుతోందని ప్రధాని హెచ్చరించారు. "మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేవలం ఒక నేరం మాత్రమే కాదు.. ఇది మన యువతరానికి, ప్రాంతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు" అని




పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు, భద్రతాపరమైన ముప్పులు, సమాచార భద్రత, వ్యవస్థీకృత నేరాలను ఎదుర్కోవడానికి రాజా దేశాల మధ్య బలమైన సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సహా చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ , ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లూకాషెంకో, కజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌సీవో సమావేశానికి ముందు సభ్య దేశాల నేతలు అధికారిక గ్రూప్ ఫొటో దిగారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మోదీ షేక్‌హ్యాండ్ ఇవ్వడం అందరినీ ఆకర్షించింది. అనంతరం మోదీ, జిన్‌పింగ్, పుతిన్ ముగ్గురు నేతలూ కలిసి కాసేపు ముచ్చటించుకున్నారు.

# కడుపునిండా ఆకలి!

## పాకిస్థాన్‌లో తీవ్ర ఆహార సంక్షోభం.. గణనీయంగా పెరిగిన ఆహార అభద్రత.. గ్రామీణ ప్రాంతాలపై అధిక ప్రభావం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో ఆహార సంక్షోభం తీవ్రరూపం దాల్చుతోంది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, ఆదాయం పడిపోవడంతో ప్రజలు తమ ఆహారపు అలవాట్లను గణనీయంగా మార్చుకుంటున్నారు. ఆరేళ్ల క్రితంతో పోలిస్తే పాలు, మాంసం, బియ్యం, గోధుమలు వంటి ప్రధాన ఆహార పదార్థాల వినియోగాన్ని భారీగా తగ్గించుకున్నారని పాకిస్థాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పీబీఎస్) విడుదల చేసిన తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పీబీఎస్ నివేదిక ప్రకారం, 2018–19లో తలసరి నెలవారీ గోధుమల వినియోగం 7.0 కిలోలు ఉండగా, 2024–25 నాటికి అది 6.59 కిలోలకు తగ్గింది. ఇదే కాలంలో బియ్యం వాడకం 1.06 కిలోల నుంచి 0.86 కిలోలకు, పప్పుధాన్యాలు 0.35 కిలోల నుంచి 0.26 కిలోలకు పడిపోయాయి. పౌష్టికాహారంలో కీలకమైన తాజా పాల వినియోగం 6.85 కిలోల నుంచి 6.15 కిలోలకు, మాంసం (బీఫ్, మటన్, చికెన్) వినియోగం 0.61 కిలోల నుంచి 0.50 కిలోలకు క్షీణించింది. దీనికి పూర్తి విరుద్ధంగా, వనస్పతి (వెజిటబుల్ ఘీ) వినియోగం మాత్రం 81 శాతం పెరిగి, నెలకు 0.69 కిలోల నుంచి 1.25 కిలోలకు చేరడం గమనార్హం. ఈ మార్పులకు గల కారణాలను పాకిస్థాన్ ఎకనామిక్ సర్వే 2025–26, హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్ఐఈఎస్) 2024–25 స్పష్టంగా విశ్లేషించాయి. ఆహార పదార్థాల ధరలు పెరిగి, ప్రజల కొనుగోలు శక్తికి మించినప్పుడు పోషకాహారాన్ని వదులుకోవాల్సి వస్తోందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా తక్కువ ఆదాయ వర్గాల వారు ప్రొటీన్లు అధికంగా ఉండే పాలు, మాంసం వంటి వాటికి బదులుగా, చౌకగా లభించే, కేలరీలు ఎక్కువగా ఉండి పోషకాలు తక్కువగా ఉండే పదార్థాలను



ఎంచుకుంటున్నారు. ఈ సంక్షోభం కారణంగా దేశంలో ఆహార అభద్రత కూడా గణనీయంగా పెరిగింది. ఆహార అభద్రతతో బాధపడుతున్న కుటుంబాల శాతం 2019లో 15.92 శాతం ఉండగా, 2025 నాటికి అది 24.35 శాతానికి పెరిగింది. తీవ్రమైన ఆహార అభద్రత 2.37 శాతం నుంచి 5.04 శాతానికి చేరింది. పట్టణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలపై ప్రభావం ఎక్కువగా ఉంది. మొత్తం మీద కేలరీలు తగినంతగా లభిస్తున్నప్పటికీ, ఆహార నాణ్యత గణనీయంగా క్షీణించిందని, ఇది ముఖ్యంగా పిల్లల పోషణపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రియురాలు బైక్‌పై ఉంటే ఉత్సాహం సహజమే: మద్రాస్ హైకోర్టు

చెన్నై: ఓ రోడ్డు ప్రమాదం కేసు విచారణ సందర్భంగా మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బైక్‌పై ప్రియురాలు వెనుక కూర్చుంటే, నడిపే ప్రియుడికి ఉత్సాహం రావడం సహజమేనని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కారణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, ప్రమాదంలో మరణించిన యువకుడికి పాక్షిక బాధ్యత ఉందని నిర్ధారించింది. 2018 మే 10న తేని జిల్లాకు చెందిన 19 ఏళ్ల గోపాల్, తన ప్రియురాలు రాజేశ్వరితో కలిసి బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. వీరపాండి–వాయల్‌పట్టి మార్గంలో అర్ధరాత్రి సమయంలో వారి బైక్‌ను ఓ వ్యాన్ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందగా, రాజేశ్వరి గాయపడ్డారు. దీంతో గోపాల్ తల్లిదండ్రులు పరిహారం కోసం తేని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రిబ్యునల్, 2021లో మృతుడి కుటుంబానికి రూ. 25.5 లక్షలు చెల్లించాలని వ్యాన్ బీమా సంస్థను ఆదేశించింది.

# ప్రజాపాలన.. పేదల పక్షపాతి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): పేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన సాగించిందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జగిత్యాల మోతే రోడ్డులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో ప్రజా పాలన సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమాన్ని విస్తరిస్తూ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. రైతులకు భరోసా, మహిళలకు సాధికారత, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు ప్రపంచస్థాయి మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, రూ.21 వేల కోట్ల రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏటీసీ సెంటర్ల వంటి అనేక కార్యక్రమాలను అమలు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసినప్పటికీ.. వడ్డీలు చెల్లిస్తూనే అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఆక్సిజన్‌లా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరించి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని సంజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని, వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, మున్సిపల్ చైర్మన్ వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్, నాయకులు మన్సూర్, కొత్త మోహన్, తాటిపర్తి శరత్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాక్‌లో 125 ఏళ్ల హిందూ ఆలయం కూల్చివేత

### భగ్గుమన్న మైనారిటీ సంఘాలు.. మదర్సా విస్తరణ కోసం కూల్చినట్లు ఆరోపణ

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఒక పురాతన హిందూ దేవాలయాన్ని కూల్చివేయడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. మదర్సా విస్తరణ కోసం మత ఛాందసవాదులు ఈ ఆలయాన్ని ఉద్దేశపూర్వకంగానే ధ్వంసం చేశారని హక్కుల సంఘాలు, మైనారిటీ సంస్థలు ఆరోపిస్తున్నాయి. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఆలయాన్ని పునర్నిర్మించాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను స్థానిక అధికారులు ఖండిస్తున్నారు. భారీ వర్షాల కారణంగానే పాత నిర్మాణం కూలిపోయిందని చెబుతున్నారు. పీటీఐ వార్తా సంస్థ కథనం ప్రకారం.. లాహోర్‌కు సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న నరోవల్ జిల్లాలోని సిరాజ్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాదాపు 125 ఏళ్ల నాటి ఈ ఆలయాన్ని ఆగస్టు 21న నిషేధిత తెహ్రీక్–ఇ–లబ్బైక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు కూల్చివేశారని ఆరోపణలు వస్తున్నాయి. సుమారు 1,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆలయ భూమిని, దానికి ఆనుకుని ఉన్న మదర్సాలో కలిపేందుకే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు మైనారిటీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై పాకిస్థాన్ మసిహా మిల్లత్ పార్టీ (పీఎంఎంపీ) తీవ్రంగా స్పందించింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆలయాన్ని తిరిగి నిర్మించాలని పంజాబ్ ముఖ్యమంత్రి మర్యం నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పీఎంఎంపీ చైర్మన్ అస్లాం పర్వేజ్ సహోత్రా మాట్లాడుతూ.. కూల్చివేసిన ఆలయానికి చెందిన ఇటుకలు, శిఖరానికి ఉన్న లోహపు సామాగ్రిని కూడా దుండగులు అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో ఆలయానికి ఆనుకుని ఉన్న భూమిని ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్ (ఈటీపీబీ) ఒక మదర్సాకు లీజుకు ఇచ్చిందని, అయితే అద్దె చెల్లించకపోవడంతో ఆ లీజును రద్దు చేసిందని గుర్తుచేశారు. ఆక్రమణదారులను ఖాళీ చేయించాలని ఈటీపీబీ ఈ ఏడాది జనవరిలో ఆదేశాలు జారీ చేసినా, అధికారులు వాటిని అమలు చేయలేదని ఆయన విమర్శించారు. స్థానిక హిందూ సంఘం నాయకుడు రతన్ లాల్ కూడా ఈ ఘటనను ఖండించారు. ఆలయ ప్రాంగణంలో ఇప్పటికీ మదర్సా నడుస్తుండటంతో, కూల్చివేసిన ప్రదేశానికి వెళ్లేందుకు కూడా స్థానిక హిందువులు భయపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆలయాన్ని పునరుద్ధరించాలని కోరారు. మరోవైపు, ఈటీపీబీ అధికారి రాణా ఇఫ్తిఖార్ మాట్లాడుతూ, ఆలయం చాలా పురాతనమైనదని, భారీ వర్షాల వల్ల కూలిపోయిందే తప్ప ఎవరూ కూల్చివేయలేదని స్పష్టం చేశారు. ఆలయ పునర్నిర్మాణంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అయితే, ఈ ఆలయానికి భద్రతాపరమైన ముప్పు ఉందని స్థానిక పోలీసులు ఏప్రిల్‌లోనే ఒక నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది.

## పెరుగుతున్న సముద్ర మట్టం

### కోల్‌కతా, ముంబైకి భారీ ముప్పు.. దక్షిణాసియాలో 1.4 కోట్ల మందిపై ప్రభావం

న్యూఢిల్లీ: సముద్ర మట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. దీంతో భారత్‌లోని కోల్‌కతా, ముంబై నగరాలకు భారీ ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. ఈ ప్రభావంతో దక్షిణాసియాలో 1.4 కోట్ల మందికిపైగా ప్రజలు తమ ఇళ్లను శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉందని ఐరాస నివేదిక పేర్కొంది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా హిమనదాలు, మంచు పలకలు కరుగుతున్నాయి. సముద్ర జలాల ఉష్ణోగ్రత కూడా పెరుగుతోంది. ఫలితంగా సముద్ర మట్టాలు మరింత వేగంగా పైకి వస్తున్నాయి. 2024లో సముద్ర మట్టం ఏడాదిలో దాదాపు 6 మిల్లీమీటర్లు పెరిగింది. ఇప్పటివరకు నమోదైన అత్యధిక వార్షిక పెరుగుదల ఇదేనని నివేదిక తెలిపింది. కోల్‌కతా, ముంబైతో పాటు ఢాకా వంటి నగరాల్లో ప్రజల ఇళ్లకు ముప్పు పెరుగుతుందని ఐరాస పేర్కొంది. సముద్ర జలాలు శాశ్వతంగా చుట్టుముట్టే పరిస్థితి వస్తే భారీగా ప్రజలు వలస వెళ్లాల్సి వస్తుందని తెలిపింది. సముద్ర మట్టం పెరుగుదల ప్రభావం తీర ప్రాంతాలకే పరిమితం కాదని ఐరాస అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ నవీద్ హనీఫ్ చెప్పారు.



## హైదరాబాద్‌లో 1.40 లక్షల గణేశ్ మండపాలు

### హైడ్రా చెరువుల్లోనూ నిమజ్జనాలు.. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): హైదరాబాద్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈసారి హైదరాబాద్ నగర పరిధిలో సుమారు 1.40 లక్షల గణేష్ మండపాలు ఏర్పాటు అవుతాయని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వెల్లడించింది. ఈనెల 14వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గణేష్ ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో.. మండపాల ఏర్పాట్లు, భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మరోవైపు నిమజ్జనాల విషయంలో ఉత్సవ కమిటీ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం వేగంగా పూర్తి చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కోరింది. ప్రభుత్వానికి ఈ అంశాన్ని ఇప్పటికే వివరించినట్లు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావి నూతుల శశిధర్ తెలిపారు. ఎప్పటిలాగే చెరువులు, వినాయక సాగర్‌లో నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. నిమజ్జనాల విషయంలో హైడ్రా పరిధిలో అభివృద్ధి చేసిన చెరువులపై కూడా ఉత్సవ సమితి కీలక వ్యాఖ్యలు చేసింది. కాప్రా చెరువుతో పాటు హైడ్రా అభివృద్ధి చేసిన అన్ని చెరువుల్లోనూ గణేష్ విగ్రహాల నిమజ్జనం చేస్తామని శశిధర్ స్పష్టం చేశారు. చెరువుల్లో నిమజ్జనం చేయడం తమ సంప్రదాయమని పేర్కొన్నారు. వినాయక సాగర్‌లో నిమజ్జనంపై గతంలో కోర్టు ఆదేశాలు, అధికారుల నివేదికల నేపథ్యంలో వివాదం ఏర్పడిన విషయాన్ని ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి ప్రస్తావించింది. అయితే.. న్యాయస్థానాల తీర్పులను గౌరవిస్తూనే ఉత్సవాలను నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. దీంతో ఈ ఏడాది నిమజ్జనాల సందర్భంగా ప్రభుత్వం, పోలీసు శాఖ, జీహెచ్ఎంసీ, హైడ్రా మధ్య సమన్వయం కీలకంగా మారనుంది. హైదరాబాద్‌లో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తామని ఆయన ప్రకటించారు. మండపాల వద్ద శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## శాలివాహన సంఘం అభివృద్ధికి 1.50 లక్షలు

### నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్

రాయికల్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామ శాలివాహన (కుమ్మర) సంఘం అభివృద్ధికి రూ.1.50 లక్షల నిధులను ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ మంజూరు చేశారు. సంఘ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నిధులు మంజూరు చేయడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎం.ఏ. మోఖీద్, సంఘం అధ్యక్షుడు గంగారాం, ఉపాధ్యక్షుడు గంగశేఖర్, సభ్యులు నర్సయ్య, బక్కన్న, శ్రీనివాస్, నాయకులు ఎంబారి వెంకటేష్, సాగర్‌రావు, స్పందన, వేముల సతీష్, దొబ్బల వేణు, శ్రీరాముల గణపతి, వేణురావు తదితరులు పాల్గొన్నారు.

## క్రిటికల్ మినరల్స్ అన్వేషణ

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): తెలంగాణలో క్రిటికల్ మినరల్స్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాలకు అవసరమైన కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్, ఐఐటీ హైదరాబాద్, ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ యూనివర్సిటీ మధ్య సహకారానికి మార్గం సుగమం అవుతోంది. పరిశోధన, ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, ఖనిజాల ప్రాసెసింగ్, రిఫైనింగ్, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయి. క్రిటికల్ మినరల్స్ రంగంలో ఆస్ట్రేలియాతో కలిసి పనిచేయాలని సింగరేణి సంస్థను మోనాష్ యూనివర్సిటీ ఆహ్వానించింది. హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతితో మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం సమావేశమై ఈ రంగంలో ఉన్న అవకాశాలను వివరించింది. మోనాష్ యూనివర్సిటీ డీన్ (ఇంజినీరింగ్) ప్రొఫెసర్ యూనిస్ వెంటికోస్ నేతృత్వంలోని బృందం ఆస్ట్రేలియాలో క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, వెలికితీత, ప్రాసెసింగ్ రంగాల్లో ఉన్న అవకాశాలను సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్‌కు డిమాండ్ వేగంగా పెరుగుతోందని మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులు వివరించారు. అత్యాధునిక టెక్నాలజీ, పర్యావరణహిత మైనింగ్ పద్ధతులు, వాణిజ్యపరంగా ప్రయోజనకరమైన వ్యూహాలను అభివృద్ధి చేయడంలో తమ వర్సిటీ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ పథకాలు సకాలంలో అమలు చేయాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

జగిత్యాల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. మంగళవారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ లతతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, కులాంతర వివాహ ప్రోత్సాహకాలు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, పీఎం అజయ్, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, అంగన్‌వాడీ భవనాలు తదితర అంశాలపై సమీక్షించారు. కుల ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా జారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సుమారు రూ.2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. ఎస్సీ ప్రాంతాలకు 15 శాతం, ఎస్టీ ప్రాంతాలకు 10 శాతం నిధులు కేటాయించేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. నియామకాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ రోస్టర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని వెంకటయ్య ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు రూ.30 లక్షల బీమా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు, విచారణ సమర్థవంతంగా నిర్వహించి శిక్షల శాతం పెంచాలని ఆదేశించారు. హత్య, అత్యాచార కేసుల్లో బాధిత కుటుంబాలకు 2బీహెచ్‌కే ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 85 కులాంతర వివాహ దరఖాస్తులు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి రూ.2.42 కోట్ల బకాయిలు ఉన్నాయని అదనపు కలెక్టర్ లత తెలిపారు. 185 మంది అట్రాసిటీ బాధితులకు రూ.1.06 కోట్లకు పైగా పరిహారం విడుదలైనట్లు వివరించారు. జిల్లాలో 973 ఎస్సీ, 138 ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్లు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## డీఏలు, పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి

### నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

గంగాధర, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): ఉద్యోగులకు రావాల్సిన ఆరు డీఏలు, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీజీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి, డీటీ బండి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గంగాధర తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక పీఆర్సీని కోల్పోయామని, ప్రస్తుత ప్రభుత్వంలో రావాల్సిన పీఆర్సీని వెంటనే మంజూరు చేయాలని కోరారు. బకాయిలు విడుదల చేయకపోతే సామూహిక సెలవులు, పెన్‌డౌన్ సమ్మె చేపడతామని హెచ్చరించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఆర్ఈఎస్ఏ జిల్లా కోశాధికారి సంతోష్‌కుమార్, ఆర్ఐలు రాజ్‌కుమార్, సంతోష్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్‌టీవో తిరుపతి, జీపీఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

మల్యాల, సెప్టెంబర్ 1 (ఈవార్తలు): శ్రావణ మాసం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసం కావడంతో సాధారణ రోజులతో పోలిస్తే భక్తుల రద్దీ పెరిగింది.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
బుధవారం 2-9-2026, జగిత్యాల
www.evarthalu.com







## నవంబర్ 27న రష్మిక మైసా

రష్మిక మందన్న 'మైసా' నవంబర్ 27న థియేటర్లలోకి రానుంది. రిలీజ్ డేట్‌తో పాటు వచ్చిన పోస్టర్‌లో ఆమె చేతిలో ఈటె పట్టుకుని, రక్తం ఉన్న లుక్‌లో కనిపించింది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్ కూడా ఇదే రఫ్ టోన్‌లో ఉన్నాయి. సినిమా షూటింగ్ మాత్రం ఇంకా పూర్తి కాలేదు. రష్మిక గాయం నుంచి కోలుకుని మళ్లీ సెట్స్‌లోకి రావాల్సి ఉంది.

డేట్ ఫిక్స్ కావడంతో మిగిలిన పనికి ఇప్పుడు మూడు నెలల సమయం ఉంది. 'మైసా' షూటింగ్‌లోనే రష్మికకు హిప్ దగ్గర గాయమైంది. ఒక డాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె ఆమె ఇబ్బంది పడింది. ఆ తర్వాత కొంతకాలం పని ఆపి రెస్ట్ తీసుకుంది. ఇప్పుడు ఆరోగ్యం మెరుగుపడటంతో మళ్లీ షూటింగ్స్ మొదలుపెట్టేందుకు సిద్ధమవుతోంది. సినిమా కోసం ఇంకా కొంత భాగం మిగిలి ఉండటంతో, ఆమె మళ్ళీ వచ్చాక షెడ్యూల్‌ను ప్లాన్ చేయనున్నారు. ఈ సినిమాలో రష్మిక గోండ్ తెగకు చెందిన యువతిగా కనిపించనుంది. పాత్ర కోసం బ్యాంకాక్‌లో యాక్షన్ ట్రైనింగ్ తీసుకుంది. కేరళలో జరిగిన షెడ్యూల్‌లో స్టంట్స్ కూడా చేసింది. నీళ్లలో జరిగే ఒక టఫ్ సీక్వెన్స్‌ను ఇప్పటికే పూర్తి చేశారు. ఇప్పటివరకు రష్మిక చేసిన కమర్షియల్ సినిమాల కంటే ఇందులో ఎక్కువ హార్డ్ వర్క్ చేసినట్టు తెలుస్తోంది. అందుకే గాయం తర్వాత మిగిలిన యాక్షన్ సీన్స్ కోసం టైమ్ తీసుకుంటున్నారు. రష్మిక విజయ్ దేవరకొండతో నటించిన 'రణబాలి' అక్టోబర్ 16న వస్తోంది. దానికి 42 రోజుల తర్వాత 'మైసా' రిలీజ్ అవుతుంది. రెండు సినిమాల ప్రమోషన్స్ ఒకే సమయంలో దగ్గరపడే అవకాశం ఉంది. 'మైసా'లో మాత్రం కథ మొత్తం తన చుట్టూ తిరిగేలా ఇప్పటివరకు చూపించారు. నవంబర్ వరకు రష్మికకు షూటింగ్‌తో పాటు రెండు సినిమాల ప్రమోషన్స్ కూడా వరుసగా ఉండొచ్చు. డైరెక్టర్ రవీంద్ర పుల్లెకు 'మైసా' మొదటి సినిమా. మొదటి సినిమాతోనే ఐదు భాషల్లో విడుదలకు వెళ్లడం అంటే అతనిపై చాలా ప్రెజర్ ఉంటుంది. ఈశ్వరీరావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రల్లో ఉన్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటివరకు బయటకు వచ్చిన మెటీరియల్‌లో కథ కంటే రష్మిక పాత్ర, ఆమె లుక్, యాక్షన్ పార్ట్ లను ఎక్కువగా హైలెట్ చేశారు. ట్రైలర్ వచ్చిన తర్వాతే కథ ఎలా నడుస్తుందో తెలుస్తుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో నవంబర్ 27నే సినిమాను విడుదల చేయనున్నారు. డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ తీసుకోగా, ఆడియో హక్కులు టీ సిరీస్ దగ్గర ఉన్నాయి. థియేటర్ రిలీజ్‌కు ముందే సినిమా మంచి డిమాండ్ ను అందుకుంటోంది. ఇప్పుడు మేకర్స్ చేతిలో ఎక్కువ టైమ్ లేదు. రష్మిక షూటింగ్‌లోకి వచ్చిన తర్వాత మిగిలిన భాగం పూర్తయితే, అక్టోబర్ నుంచి రెగ్యులర్ ప్రమోషన్స్ స్టార్ట్ కావచ్చు.



## దేవరకొండ చిన్న కోడలు.. వైష్ణవి!?

యూట్యూబ్ వీడియోలు, షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ ప్రారంభించి 'బేబీ' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ హీరోయిన్‌గా మారిన వైష్ణవి చైతన్య గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో కలిసి నటించిన 'ఎపిక్' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమోషనల్ రాపిడ్ ఫైర్ సెషన్‌లో వైష్ణవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సిద్ధు జొన్నలగడ్డను లవ్ చేస్తానని, ఆనంద్ దేవరకొండను పెళ్లి చేసుకుంటానని చెప్పి అందరికీ షాక్ ఇచ్చింది. 'ఎపిక్' సినిమా ప్రమోషన్లలో భాగంగా యాంకర్ వైష్ణవికి ఒక ఆసక్తికరమైన ప్రశ్న వేశారు. సిద్ధు జొన్నలగడ్డ, విరాజ్, ఆనంద్ దేవరకొండ.. ఈ ముగ్గురిలో ఎవరితో లవ్, ఎవరితో పెళ్లి, ఎవరికి బ్రేకప్ చెప్తారని అడిగారు. ఇక దీనికి వైష్ణవి ఏమాత్రం తడబడకుండా విరాజ్‌కి బ్రేకప్ చెప్పేస్తానని, సిద్ధు జొన్నలగడ్డతో లవ్ అని, ఆనంద్ దేవరకొండను మాత్రం పెళ్లి చేసుకుంటానని సమాధానమిచ్చింది. దీంతో ఈ కామెంట్స్ నెట్టింట ఒక్కసారిగా వైరల్ అయ్యాయి. దేవరకొండ ఫ్యామిలీలోకి మరో హీరోయిన్ ఎంట్రీ ఇవ్వబోతోందని టాక్ మొదలైంది.



## నిర్మాతగా నిత్యామేనన్

తెలుగులో 'భీమ్లా నాయక్' సినిమాలో చివరగా కనిపించిన నిత్యామేనన్.. ప్రస్తుతం తమిళ, మలయాళ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. 50కి పైగా మూవీస్ చేసిన ఈమె ఇప్పుడు ఓ శుభవార్త చెప్పేసింది. నిర్మాతగా మారినట్లు వెల్లడించింది. హీరోయిన్లు.. నిర్మాతలుగా మారడం కొత్తేమీ కాదు. అప్పట్లోనే మహానటి సావిత్రి లాంటి వాళ్లు తమ అభిరుచికి తగ్గ మూవీస్ చేశారు. ప్రస్తుతం అగ్రనటిగా ఉన్న నయనతార కూడా చిత్ర నిర్మాణం చేపట్టి వరసగా చిత్రాలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు ఈ లిస్టులోకి నిత్యామేనన్ చేరింది. కేయూరి ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నిర్మాణ సంస్థ ప్రారంభించి తొలి ప్రయత్నంగా లియో విజన్ సంస్థతో కలిసి చిత్రాన్ని నిర్మించడానికి రెడీ అయింది. ప్రముఖ దర్శకుడు విక్రమ్ కుమార్ ఈ చిత్రానికే క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. నిర్మాతగా వ్యవహరిస్తున్న నిత్యామేనన్ ఇందులో హీరోయిన్‌గానూ చేస్తోంది. డీకే కథ ,దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఫాంటసీ విత్ డార్క్ కామెడీ నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇతర నటీనటులు, టైటిల్ లాంటి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు.

## మమితా బైజు హ్యాట్రిక్

మలయాళ బ్యూటీ మమితా బైజుకు మహర్దశ పట్టినట్టు ఉంది. ఆమె పట్టిందల్లా బంగారమే అన్నట్లు అనిపిస్తోంది. అందుకు సజీవ సాక్ష్యం ఇప్పుడు రిలీజైన సినిమాలే. ఇటీవల ఆమె నటించిన మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద అరుదైన రికార్డ్ క్రియేట్ చేశాయి. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఈ సినిమాలు రిలీజ్ కాగా.. ఒక్కొక్కటి రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించాయి. దీంతో నెల రోజుల్లోనే మూడు సినిమాలు రూ.200 కోట్లు సాధించిన హీరోయిన్‌గా మమితా బైజు రికార్డ్ సృష్టించింది. జూలై 23న ఆమె నటించిన జన నాయగన్ బాక్సాఫీస్ వద్ద సందడి చేసింది. ఈ చిత్రంలో దళపతి విజయ్ హీరోగా నటించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆ తర్వాత సూర్య సరసన హీరోయిన్‌గా కనిపించింది. విశ్వనాథ్ అండ్ సన్స్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రం రూ.240 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఇటీవల రిలీజైన మలయాళ మూవీ బెత్లెహమ్ ఫ్యామిలీ యూనిట్ సైతం బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేసింది. దీంతో హ్యాట్రిక్ కొట్టిన మమితా బైజు అరుదైన ఫీట్ సాధించింది. ఈ విషయంలో తొలి హీరోయిన్‌గా ఘనతను సొంతం చేసుకుంది.





## పరారీలో 'బాసింగ బలాలే' డ్యాన్సర్ ఈశ్వర్ సాయి

'బాసింగ బలాలే' అనే ఫోక్ సాంగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న డ్యాన్సర్ ఈశ్వర్ సాయి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఇతడి కోసం పోలీసు గాలిస్తున్నారు. తోటి డ్యాన్సర్ మాధురి రాథోడ్ కేసు పెట్టడమే దీనంతటికి కారణం. పెళ్లి పేరుతో తనని శారీరకంగా ఉపయోగించుకుని మోసం చేశాడని మాధురి కొన్నిరోజుల క్రితం నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈశ్వర్ సాయి కోసం వెతుకుతున్నారు. స్వతహాగా డ్యాన్సర్ అయిన ఈశ్వర్ సాయి, మాధురి కలిసి పలు ఆల్బమ్ సాంగ్స్ చేశారు. ఈ క్రమంలోనే వీళ్లిద్దరి మధ్య బంధం బలపడినట్లు తెలుస్తోంది. కొన్నిరోజుల క్రితం ఓ రోజు రాత్రి, వేములవాడలోని రెడ్డి భవన్‌లో మాధురితో ఏకాంతంగా ఉన్నప్పుడు ఈశ్వర్ సాయిని ఇతడి భార్య రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది.



## నగ్నంగా నిలబెడతా: రీతాభరి చక్రవర్తి

సినీ పరిశ్రమలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ప్రముఖ బెంగాలీ నటి రీతాభరి చక్రవర్తి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను ఎవరైనా వేధించినా లేదా లైంగిక దాడికి యత్నించినా వారిని వీధుల్లో నగ్నంగా నిలబెడతానంటూ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. గతంలో తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ పరిశ్రమలోని కామాంధుల ముసుగులు త్వరలోనే తొలగిపోతాయని ఆమె చేసిన స్ట్రాంగ్ స్టేట్‌మెంట్ ఇప్పుడు నెట్టింట తీవ్ర కలకలం రేపుతోంది. "ఏళ్లపాటు వేధింపులు భరించిన తర్వాతే నేను ధైర్యంగా మాట్లాడుతున్నాను. ఇండస్ట్రీకి కొత్తగా వచ్చిన సమయంలో ఏమైనా మాట్లాడితే నన్ను ఎక్కడ బాయ్‌కాట్ చేస్తారోననే భయంతో మౌనంగా ఉన్నాను. కానీ ఇకపై వేధింపులకు పాల్పడే వారిని అస్సలు వదిలేది లేదు, అలాంటి వారిని వీధిలో నగ్నంగా నిలబెడతా" అని ఆమె స్పష్టం చేశారు.

## టాక్ ఆఫ్ ది టౌన్.. అనంతిక



టాలీవుడ్‌లో ట్రెండింగ్ కథానాయికగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంటోంది తెలుగమ్మాయి అనంతిక సనిల్ కుమార్. చిన్నతనం నుంచే కళలను శ్వాసించిన ఈ భామ.. ప్రస్తుతం పొరుగు భాషల్లోనూ వరుస అవకాశాలు దక్కించుకుంటూ పరిశ్రమలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తోంది. ఎల్.కే.జీ చదువుతున్న రోజుల నుంచే నృత్యం, యుద్ధ విద్యలు (ఫైట్స్) వంటి విభిన్న కళా రూపాలను సాధన చేయడం తన అభిరుచిగా మార్చుకున్నానని తెలిపింది. శారీరక శ్రమతో కూడిన ఈ సాధనే నటిగా తన హావభావాలను, ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి ఎంతగానో దోహదపడిందని వివరించిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. అవకాశం వచ్చిన ప్రతి భాషనూ గౌరవిస్తూ తమిళం, మలయాళం, తెలుగు భాషల్లో సమాంతరంగా ప్రాజెక్ట్‌లు అంగీకరిస్తున్నట్లు అనంతిక వెల్లడించింది. ఊరికే ఇంట్లో సమయాన్ని వృథా చేయడం తనకు అస్సలు నచ్చదని.. దేవుడు రోజులో అందించే సమయాన్ని కళా సాధనకే కేటాయిస్తుంటానని పేర్కొంది. డ్యాన్స్, రకరకాల పాత్రల సాధన ద్వారా నటనలోని లోతులను సులభంగా అర్థం చేసుకోగలిగానని తెలిపింది. ఏ ఒక్క భాషకే పరిమితం కాకుండా.. ఎక్కడ మంచి కథలు లభిస్తే అక్కడ తన నటనతో ఆకట్టుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఈ యంగ్ బ్యూటీ వెల్లడించింది.



# ముంబై కెప్టెన్సీ..
# తిలక్ వర్మకు!?

ఐపీఎల్ వర్గాల్లో కొన్ని నెలలుగా హాట్ టాపిక్‌గా మారిన స్టార్ ఆల్-రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజా సమాచారం ప్రకారం హార్దిక్ పాండ్యా ఐపీఎల్ 2027 సీజన్‌లో కూడా ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్టుతోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, అతనికి కెప్టెన్సీ బాధ్యతలు మాత్రం దక్కకపోవచ్చని తెలుస్తోంది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రచురించిన ఒక కథనం ప్రకారం, హార్దిక్ ట్రేడింగ్ కోసం జరిపిన చర్చలు ఇప్పటివరకు ఫలించకపోవడంతో అతడిని జట్టులోనే కొనసాగించే దిశగా యాజమాన్యం ఆలోచిస్తోంది. ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ కొత్త కెప్టెన్ నాయకత్వంలో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. జట్టుకు ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ, మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడానికి సుముఖంగా లేడు. అయితే, తదుపరి సారథి ఎంపిక కోసం జరుగుతున్న చర్చల్లో అతడు చురుగ్గా పాల్గొంటున్నాడని ఆ కథనం పేర్కొంది. ప్రస్తుతం కొత్త కెప్టెన్ రేసులో యువ ఆటగాడు, హైదరాబాదీ ప్లేయర్ తిలక్ వర్మ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతనితో పాటు సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పేరును కూడా యాజమాన్యం పరిశీలిస్తోంది. ప్రస్తుతానికైతే తిలక్ వర్మకే ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ విషయానికొస్తే, ముంబై యాజమాన్యం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో (కేకేఆర్) చర్చలు జరిపింది. ఈ చర్చల్లో భాగంగా ఆస్ట్రేలియా ఆల్-రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను ఇచ్చేందుకు కేకేఆర్ ఆసక్తి చూపింది. అయితే, వచ్చే ఏడాది గ్రీన్ వర్క్‌లోడ్‌పై ఉన్న సందేహాల కారణంగా ముంబై ఇండియన్స్ ఈ డీల్‌కు అంగీకరించలేదని సమాచారం. మరోవైపు, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తమ కొత్త హెడ్ కోచ్‌ను నియమించుకున్న తర్వాత వారితోనూ చర్చలు జరిపే అవకాశం ఉంది. "ఒక ఆటగాడి ట్రేడింగ్ జరగాలంటే చాలా అంశాలు కలిసిరావాలి. అందుకే ఈ ప్రక్రియ అంత సులభం కాదు. బహుశా అతడిని ట్రేడ్ చేయకపోవచ్చు. ఈ విషయంపై ఆటగాడితో కూడా చర్చలు జరిగాయి" అని ఈ పరిణామాలను గమనిస్తున్న వర్గాలు వెల్లడించినట్టు ఆ కథనం పేర్కొంది. గత 2026 సీజన్‌లో పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడిన స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌ను ముంబై ఇండియన్స్ అట్టిపెట్టుకోనుంది. కేవలం ఒక సీజన్ ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను వదులుకోవడం ముంబై పనితీరు కాదని, 'వన్ ఫ్యామిలీ' అనే ట్యాగ్‌కు కట్టుబడి ఉంటామని యాజమాన్య వర్గాలు స్పష్టం చేశాయి. దీంతో సూర్యకుమార్ ఐపీఎల్ 2027లో కూడా ముంబై తరఫునే ఆడటం ఖాయమైంది. అలాగే, హెడ్ కోచ్ మహేల జయవర్ధనే కూడా తన పదవిలో కొనసాగనున్నాడు.




# ఏడుగురు
# పాక్ ఆటగాళ్లపై వేటు!

**లార్డ్స్ టెస్టులో ఓటమి తర్వాత పీసీబీ చర్యలు**

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఎదురైన ఘోర పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రక్షాళన చర్యలకు ఉపక్రమించింది. లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైన వెంటనే, సిరీస్ మధ్యలోనే జట్టులో సమూల మార్పులు చేపట్టింది. ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించడంతో పాటు, రెడ్-బాల్ కోచింగ్ సిబ్బందిపై కూడా వేటు వేసింది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్, పరిమిత ఓవర్ల క్రికెట్ మాజీ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాతో పాటు అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, ముహమ్మద్ అవైస్ జాఫర్, ఖుర్రం షాజాద్‌లను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. వీరిలో సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్‌లకు టెస్ట్ అనుభవం ఉండగా, అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లాలకు తొలిసారిగా టెస్ట్ జట్టులో చోటు లభించింది. ఆటగాళ్లపైనే కాకుండా కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేసింది. టెస్ట్ క్రికెట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. వారి స్థానంలో ఈ పర్యటన ముగిసే వరకు వైట్-బాల్ కోచ్ మైక్ హెసన్, యాష్లే నోఫ్కేలకు అదనపు బాధ్యతలు అప్పగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ ఇప్పటికే 0-2తో వెనుకబడగా.. ఆటగాళ్ల పేలవ ఫామ్, గాయాల వివాదాలే ఈ మార్పులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో ప్రారంభం కానుంది.




# శ్రేయస్‌కే కెప్టెన్సీ
# బుమ్రా ఎంట్రీ

**ఆఫ్ఘన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఎంపిక**




ఆఫ్ఘనిస్థాన్‌తో స్వదేశంలో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం టీమిండియా జట్టును ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్‌కే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

గాయం కారణంగా కొంతకాలంగా జట్టుకు దూరమైన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌తో పునరాగమనం చేయడం అభిమానులకు శుభవార్త. అయితే, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డిల ఎంపిక వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.




ఈ సిరీస్‌కు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుండగా, సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో మ్యాచ్‌లు జరగనున్నాయి. జింబాబ్వే పర్యటనకు ఎంపిక కాని వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి వంటి ఆటగాళ్లు జట్టులో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. జింబాబ్వే పర్యటనలో భాగమైన ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్‌లకు ఈసారి చోటు దక్కలేదు. ఇక, హార్దిక్ పాండ్యాకు జట్టులో స్థానం లభిస్తుందన్న ఊహాగానాలకు తెరదించుతూ, సెలక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదు. జూలైలో ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గాయపడిన బుమ్రా, అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్నాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన టెస్ట్ సిరీస్‌కు కూడా అతను దూరమయ్యాడు. అదేవిధంగా, ఇంగ్లండ్‌తో వన్డేలలో తొడ కండరాల గాయంతో బాధపడిన వాషింగ్టన్ సుందర్ కూడా తిరిగి జట్టులోకి రావడం బౌలింగ్ విభాగానికి బలాన్ని చేకూర్చనుంది. గతంలో మోకాలి గాయంతో టీ20 ప్రపంచకప్‌కు దూరమై, ఆ తర్వాత పునరాగమనం చేసిన హర్షిత్ రాణా, మళ్లీ గాయపడి ఇప్పుడు కోలుకుని జట్టులోకి ఎంపికయ్యాడు. అయితే వీరు ఫిట్‌నెస్ క్లియరెన్స్ సాధించాల్సి ఉంటుంది.

**ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు భారత జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.

# నమ్మకంగా ఉన్నా: రుతురాజ్

టీమిండియాలోకి తిరిగి రావడంపై భారత బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ పూర్తి విశ్వాసంతో ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో పరుగులు సాధిస్తూ తన స్థానాన్ని తిరిగి సంపాదించుకోవడంపైనే దృష్టి పెట్టినట్లు చెప్పాడు. అవకాశం వచ్చినప్పుడు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపాడు. టీమిండియాలోకి పునరాగమనంపై మంగళవారం కోయంబత్తూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రుతురాజ్‌ను మీడియా ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ.. "చాలా నమ్మకంగా ఉన్నా. మళ్లీ వెళ్లి పరుగులు చేయడంపైనే దృష్టి. ఇన్నాళ్లూ పరుగులు సాధిస్తూనే ఉన్నా. ఇక నిలకడగా రాణిస్తూ అవకాశం కోసం ఎదురుచూడాలి" అని చెప్పాడు. ప్రస్తుతం జాతీయ జట్టులో చోటు కోసం దేశవాళీ క్రికెట్‌లో రుతురాజ్ తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన బ్యాటింగ్‌పై నమ్మకం ఉందని స్పష్టం చేశాడు. దేశవాళీ సీజన్ మొదలుకానున్న నేపథ్యంలో రాబోయే టోర్నీలపై దృష్టి పెట్టినట్లు తెలిపాడు. ఇదిలా ఉంటే.. ఆఫ్ఘనిస్థాన్‌తో భారత్ తలపడనున్న నేపథ్యంలో రషీద్ ఖాన్, యువ భారత బ్యాటర్ సూర్యవంశీ మధ్య ఆసక్తికర పోరు ఉంటుందా? అని రుతురాజ్‌ను అడిగారు. అయితే ఈ పోరుపై తాను పెద్దగా ఆలోచించలేదని చెప్పాడు. "మీరు మీ దేశానికి మద్దతు ఇవ్వాలని కోరుకుంటారు.. నేనూ అంతే, నా దేశానికి మద్దతివ్వాలని కోరుకుంటాను" అని అన్నాడు. జట్టులో లేనప్పుడు తాను మ్యాచ్‌లను ఎక్కువగా చూడనని తెలిపాడు. ప్రస్తుతం తన సాధనపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు రుతురాజ్ తెలిపాడు. ప్రాక్టీస్‌తో పాటు దేశవాళీ టోర్నీలు కూడా ఉండటంతో టీమిండియా మ్యాచ్‌లను రోజూ చూడటం సాధ్యం కావడం లేదన్నాడు. దులీప్ ట్రోఫీ తర్వాత ఇరానీ కప్ జరగనుంది. ఆ తర్వాత రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టోర్నీలు ఉన్నాయి. ఈ టోర్నీల్లో రాణించి మరోసారి భారత జట్టులో చోటు దక్కించుకోవాలని రుతురాజ్ చూస్తున్నాడు.




# హార్దిక్ పాండ్యాకు మళ్లీ గాయం!

టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. గాయం నుంచి కోలుకుని బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో (జాతీయ క్రికెట్ అకాడమీ) శిక్షణ పొందుతున్న అతడికి, తాజాగా కాలికి స్వల్ప గాయమైంది. దీంతో అతడి కమ్‌బ్యాక్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ గాయం కారణంగా, సెప్టెంబర్ 13న ప్రారంభం కానున్న ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు హార్దిక్ దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యా ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకుంటున్నాడు. అయితే, చివరి నిమిషంలో కాలికి స్వల్పంగా నొప్పి రావడంతో అతడిని బౌలింగ్ చేయవద్దని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సిబ్బంది సూచించారు. బ్యాటింగ్, ఇతర కదలికలకు పెద్దగా సమస్య లేనప్పటికీ, పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు ధ్రువీకరణ లభించే వరకు అతడిని జట్టులోకి అనుమతించేది లేదని తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆఫ్ఘనిస్థాన్ సిరీస్ నాటికి అతను పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించడం అనుమానంగానే ఉంది. 32 ఏళ్ల హార్దిక్ పాండ్యా, మే 24న ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడినప్పటి నుంచి మరే ఇతర మ్యాచ్‌లో పాల్గొనలేదు. ఇక, భారత్ తరఫున చివరిసారిగా మార్చి 8న టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో ఆడాడు. అప్పటి నుంచి స్వదేశంలో ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌తో పాటు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు దూరమయ్యాడు. గతంలో క్వాడ్రిసెప్స్ కండరాల గాయం కూడా అతడి కోలుకునే ప్రక్రియను ఆలస్యం చేసింది. ఈ వారం సెలెక్టర్లు సమావేశమై ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ సందర్భంగా బెంగళూరులో కోలుకుంటున్న ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై వారికి నివేదిక అందజేయనున్నారు.



# దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్

**సెంట్రల్ జోన్‌పై 4 వికెట్ల తేడాతో విజయం.. ఇషాన్ కిషన్ కెప్టెన్ ఇన్నింగ్స్**

దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్లో ఈస్ట్ జోన్ ఘన విజయం సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను నాలుగు వికెట్ల తేడాతో మట్టికరిపించి ఫైనల్లోకి అడుగుపెట్టింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 159 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఈస్ట్ జోన్‌కు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (43 బంతుల్లో 43) మెరుపు ఆరంభాన్ని అందించాడు. అయితే, సెంట్రల్ జోన్ బౌలర్ హర్ష్ దూబే నాలుగు వికెట్లు పడగొట్టి ఈస్ట్ జోన్‌పై ఒత్తిడి పెంచాడు. ఈ దశలో సంయమనంతో ఆడిన కెప్టెన్ ఇషాన్ కిషన్ (41 బంతుల్లో 39 నాటౌట్) జట్టుకు విజయాన్ని ఖరారు చేశాడు. అతనికి మహమ్మద్ షమీ (8 నాటౌట్) సహకరించాడు. అంతకుముందు, సెంట్రల్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 158 పరుగులకే కుప్పకూలింది.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ప్రకృతి చెప్తున్నా మనం వినం

ప్రకృతి హెచ్చరిస్తోంది. కానీ మనిషి మాత్రం ఇంకా వినిపించుకోనట్టే వ్యవహరిస్తున్నాడు. నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలు, కొండచరియల విరిగిపడటం, ఆకస్మిక విపత్తులు ఒక దేశానికో.. ఒక ప్రాంతానికో పరిమితమైన సమస్యగా చూడటం పొరపాటు. అది రాబోయే రోజుల్లో ప్రపంచం ఎదుర్కోబోయే ప్రమాదాలకు ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. హిమాలయ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ విధ్వంసం ప్రకృతి వైపరీత్యాల తీవ్రత ఎంత వేగంగా పెరుగుతోందో చాటి చెబుతోంది. నేడు నేపాల్.. రేపు మరెక్కడో. ఎల్లుండి మన గడప ముందుకూ రావచ్చు. వాతావరణ మార్పు ఇక భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదం కాదు. అది ఇప్పటికే మన కళ్లముందే జరుగుతున్న వాస్తవం. ఒకప్పుడు వందేళ్లకు ఒకసారి వస్తాయని భావించిన భారీ వర్షాలు ఇప్పుడు తరచుగా సంభవిస్తున్నాయి. కొన్ని గంటల్లోనే నెలల వర్షపాతం కురుస్తోంది. ఎండలు రికార్డులు బద్దలు కొడుతున్నాయి. హిమనదాలు కరుగుతున్నాయి. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తుపాన్ల తీవ్రత మారుతోంది. అడవుల్లో కార్చిచ్చులు విస్తరిస్తున్నాయి. కరువు, వరదలు ఒకదాని వెంట ఒకటి దాడి చేస్తున్నాయి. అంటే ప్రకృతి సమతుల్యతలో వస్తున్న మార్పులు మానవ సమాజం నిర్మించుకున్న అన్ని అంచనాలను తలకిందులు చేస్తున్నాయి. ఇక్కడ అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. విపత్తుల తీవ్రత పెరుగుతున్నంత వేగంగా మన విపత్తు నిర్వహణ వ్యవస్థలు బలపడుతున్నాయా? అన్నది. వరద వస్తే సహాయక బృందాలను పంపడం, కొండచరియలు విరిగితే సహాయక చర్యలు చేపట్టడం, ఇళ్లు కొట్టుకుపోతే పరిహారం ప్రకటించడం మాత్రమే విపత్తు నిర్వహణ కాదు. అసలు విపత్తు రాకముందే ప్రమాద ప్రాంతాలను గుర్తించడం, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం, అత్యవసర తరలింపు మార్గాలను సిద్ధం చేయడం, స్థానిక ప్రజలకు శిక్షణ ఇవ్వడం.. ఇవే ప్రాణాలను కాపాడే నిజమైన చర్యలు. ప్రకృతి వైపరీత్యాన్ని పూర్తిగా ఆపడం మనిషి చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ దాని వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. అందుకే అభివృద్ధి నమూనాను కూడా పునఃపరిశీలించాల్సిన సమయం వచ్చింది. కొండలను తొలిచి రహదారులు వేయడం, నదుల సహజ ప్రవాహాలను అడ్డుకోవడం, వాగులు-వంకలను ఆక్రమించడం, చెరువులను కబ్జా చేయడం, అడవులను విచ్చలవిడిగా నరికివేయడం, పర్యావరణ సామర్థ్యాన్ని పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టడం.. ఇవన్నీ విపత్తుల ప్రభావాన్ని మరింత పెంచుతున్నాయి. ప్రకృతి తన దారిని తాను వెతుక్కుంటుంది. మనిషి మూసేసిన వాగు మరో మార్గంలో ప్రవహిస్తుంది. నదీ పరీవాహక ప్రాంతంలో నిర్మించిన నిర్మాణాలను వరద నీరు క్షమించదు. కొండల సహజ సమతుల్యతను దెబ్బతీస్తే ఏదో ఒకరోజు ఆ కొండే కూలిపోవచ్చు. చెరువులను పూడ్చి నగరాలను నిర్మిస్తే భారీ వర్షం వచ్చినప్పుడు నీటికి దారి ఉండదు. అప్పుడు వరదను నిందించడం ఎంతవరకు సమంజసం? తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా భారతదేశంలోని అనేక ప్రాంతాలు ఇప్పటికే దీనికి ప్రత్యక్ష ఉదాహరణలుగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో స్వల్ప వ్యవధిలో కురిసే భారీ వర్షాలు నగర జీవనాన్ని స్తంభింపజేస్తున్నాయి. కొండ ప్రాంతాల్లో కొండచరియలు, ఉత్తర భారతంలో ఆకస్మిక వరదలు, తీర ప్రాంతాల్లో తుపాన్లు, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కరువు.. ప్రాంతాలు వేరైనా మూల సమస్య మాత్రం ఒకటే.. వాతావరణంలో పెరుగుతున్న అస్థిరత. ఇది కేవలం పర్యావరణ శాఖ బాధ్యత కాదు. ఇది ప్రభుత్వాలన్నింటి బాధ్యత. పట్టణ ప్రణాళిక నుంచి వ్యవసాయం వరకు, నీటి నిర్వహణ నుంచి రహదారుల నిర్మాణం వరకు, అటవీ సంరక్షణ నుంచి గృహ నిర్మాణం వరకు ప్రతి విధానంలో వాతావరణ మార్పును ప్రధాన అంశంగా పరిగణించాలి.

ప్రతి కొత్త రహదారి వేసే ముందు.. దాని వల్ల నీటి ప్రవాహంపై ప్రభావం ఏమిటి? ప్రతి కొత్త నగరం నిర్మించే ముందు.. వర్షపు నీటికి సహజ మార్గం ఎక్కడ? ప్రతి కొండ ప్రాంతంలో నిర్మాణానికి అనుమతి ఇచ్చే ముందు.. ఆ ప్రాంత భౌగోళిక స్థిరత్వం ఎంత? ప్రతి జలాశయం, నది, వాగు విషయంలో.. భవిష్యత్తులో వచ్చే అతివృష్టిని తట్టుకునే సామర్థ్యం ఎంత? ఇలాంటి ప్రశ్నలు ఇక ప్రభుత్వ ఫైళ్లలో మాత్రమే ఉండకూడదు. అభివృద్ధి ప్రణాళికలలో అవి తప్పనిసరి ప్రమాణాలుగా మారాలి. మరో కీలక అంశం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు. వాతావరణ శాస్త్రం, ఉపగ్రహ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, భౌగోళిక సమాచార వ్యవస్థలు నేడు ఎన్నో అవకాశాలను అందిస్తున్నాయి. భారీ వర్షం ఎక్కడ పడే అవకాశం ఉంది? ఏ నది ఉప్పొంగవచ్చు? ఏ ప్రాంతంలో కొండచరియలు విరిగే ప్రమాదం ఉంది? ఏ గ్రామాన్ని ముందుగా ఖాళీ చేయాలి? వంటి విషయాల్లో సాంకేతికత ముందస్తు అంచనాలు ఇవ్వగలదు. అయితే హెచ్చరికను ప్రజల ప్రాణాలను కాపాడే చర్యగా మార్చే స్థానిక వ్యవస్థలు లేకపోతే ఆ సాంకేతికతకు ప్రయోజనం ఉండదు. అందుకే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విపత్తు సిద్ధతను ఒక నిరంతర ప్రక్రియగా మార్చాలి. ప్రతి గ్రామానికి విపత్తు ప్రణాళిక ఉండాలి. పాఠశాలల్లో పిల్లలకు విపత్తుల సమయంలో ఎలా స్పందించాలో నేర్పాలి. స్థానిక యువతకు ప్రాథమిక రక్షణ, ప్రథమ చికిత్సపై శిక్షణ ఇవ్వాలి. ఆసుపత్రులు, పోలీస్ వ్యవస్థ, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసే విధానం ఏర్పడాలి. నేపాల్ విషాదం మనకు మరో గొప్ప పాఠాన్ని కూడా చెబుతోంది. వాతావరణ మార్పుకు సరిహద్దులు లేవు. ఒక దేశంలో కరిగే హిమనది ప్రభావం మరో దేశంలోని నదీ ప్రవాహంపై పడవచ్చు. ఒక ప్రాంతంలోని పర్యావరణ విధ్వంసం దిగువ ప్రాంతాల్లోని కోట్లాది ప్రజల భద్రతను ప్రభావితం చేయవచ్చు. అందువల్ల హిమాలయ ప్రాంత దేశాల మధ్య సమాచార మార్పిడి, నదీ ప్రవాహాల పర్యవేక్షణ, విపత్తు హెచ్చరికలు, సహాయక చర్యల్లో అంతర్జాతీయ సహకారం మరింత పెరగాలి. అంతేకాదు.. వాతావరణ మార్పు గురించి మాట్లాడేటప్పుడు బాధ్యతను కేవలం ప్రజలపైకి నెట్టడం కూడా సరికాదు. వ్యక్తులు ప్లాస్టిక్ తగ్గించడం, నీటిని ఆదా చేయడం, చెట్లు నాటడం వంటి చర్యలు అవసరమే. కానీ ప్రపంచ స్థాయిలో ఉద్గారాలను పెంచుతున్న పరిశ్రమలు, ఇంధన విధానాలు, విచ్చలవిడి పట్టణీకరణ, అటవీ వినాశనంపై ప్రభుత్వాలు మరియు పారిశ్రామిక వ్యవస్థలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రకృతి ప్రతీకారం తీర్చుకుంటోందని చెప్పడం సులువు. కానీ నిజానికి ప్రకృతి ప్రతీకారం తీర్చుకోవడం కాదు.. మనం దాని నియమాలను ఉల్లంఘించినప్పుడు దాని ఫలితాలను అనుభవిస్తున్నాం. నేపాల్ విధ్వంసం ఒక హెచ్చరిక. దాన్ని మరో వార్తగా చదివి మరచిపోతే.. భవిష్యత్తులో మరిన్ని విషాదాలను మనమే ఆహ్వానించినట్టవుతుంది. వాతావరణ మార్పు వేగం పెరుగుతున్నకొద్దీ విపత్తుల స్వభావం కూడా మారుతుంది. ఊహించని సమయంలో, ఊహించని తీవ్రతతో విపత్తులు విరుచుకుపడే అవకాశం పెరుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. విపత్తు వచ్చిన తర్వాత స్పందించే వ్యవస్థ నుంచి.. విపత్తు రాకముందే ప్రమాదాన్ని గుర్తించి ప్రాణాలను కాపాడే వ్యవస్థగా మారాలి. అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాలు, వంతెనలు కాదు. వాటిని కాపాడుకునే పర్యావరణం, వాటిలో నివసించే ప్రజల భద్రత కూడా అభివృద్ధిలో భాగమే.

# పాత పుస్తకం.. కొత్త ప్రపంచం

చేతిలో ప్రపంచాన్ని చూపించే స్మార్ట్‌ఫోన్.. క్షణాల్లో సమాధానాలు అందించే కృత్రిమ మేధస్సు.. మనిషి ఆలోచనలకు తోడుగా నిలుస్తున్న అధునాతన సాంకేతికత.. మారుతున్న ఉపాధి అవకాశాలు.. రోజుకో కొత్త నైపుణ్యం అవసరమవుతున్న పోటీ ప్రపంచం.. ఇదీ నేటి వాస్తవికత. కానీ తరగతి గదిలోకి వెళ్తే మాత్రం పరిస్థితి అంతగా మారినట్టు కనిపించదు. విద్యార్థుల చేతుల్లోకి వస్తున్న పుస్తకాల్లో చాలా వరకు ఇప్పటికీ పాత కాలపు సమాచారమే ప్రధానంగా కనిపిస్తోంది. ప్రపంచం ముందుకు పరుగులు తీస్తుంటే.. మన పాఠ్యాంశాలు మాత్రం అక్కడికక్కడే నిలిచిపోవడం ఎంతవరకు సమంజసం? విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలకు సమాధానాలు గుర్తుపెట్టుకోవడం కాదు. జీవితం ఎదుర్కొనేందుకు కావాల్సిన జ్ఞానం, ఆలోచనా సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యం, సృజనాత్మకత, సంభాషణా సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక బాధ్యతలను పెంపొందించడమే నిజమైన విద్య. కానీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడమే ప్రధాన లక్ష్యంగా మారిన విద్యా విధానం పిల్లల్లో 'ఏం చదవాలి?' అనే ప్రశ్నకు సమాధానం ఇస్తోంది తప్ప.. 'ఎలా ఆలోచించాలి?' 'ఎలా నేర్చుకోవాలి?' 'ఎలా సమస్యను పరిష్కరించాలి?' అనే ప్రశ్నలకు సరైన దిశ చూపడం లేదు. ఒకప్పుడు పుస్తకమే జ్ఞానానికి ప్రధాన ఆధారం. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక్క ప్రశ్న అడిగితే కృత్రిమ మేధస్సు క్షణాల్లో సమాధానం ఇస్తోంది. ప్రపంచంలోని ఏ అంశంపైనైనా సమాచారం అందుబాటులో ఉంది. అయితే ఇక్కడే విద్యా వ్యవస్థకు అసలు సవాలు మొదలవుతోంది. సమాచారం అందించడం కాదు.. సమాచారాన్ని విశ్లేషించి, సరైనదేదో గుర్తించి, దాన్ని సృజనాత్మకంగా ఉపయోగించగల సామర్థ్యాన్ని విద్యార్థుల్లో పెంచడం. కృత్రిమ మేధస్సు రేపటి ఉద్యోగ ప్రపంచాన్ని సమూలంగా మార్చబోతోంది. కొన్ని ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది. కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. ఒకే వ్యక్తి గతంలో అనేక మంది చేసే పనిని సాంకేతిక సహాయంతో చేయగలడు. ఇలాంటి ప్రపంచంలో కేవలం పుస్తకంలోని విషయాలను కంఠస్థం చేసిన విద్యార్థి ఎంతకాలం పోటీ పడగలడు? ఏఐ ఇచ్చిన సమాధానాన్ని నమ్మకుండా ప్రశ్నించగలడా? దాని తప్పును గుర్తించగలడా? కొత్త ఆలోచనను సృష్టించగలడా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు మన పాఠ్యాంశాల్లోనే వెతకాలి.

పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ అక్షరాస్యత, కృత్రిమ మేధస్సుపై ప్రాథమిక అవగాహన, సమాచార విశ్లేషణ, ఆర్థిక అక్షరాస్యత, పర్యావరణ అవగాహన, మానసిక సామర్థ్యాల పెంపు, సంభాషణా నైపుణ్యాలు, సమస్య పరిష్కారం, బృందంగా పనిచేయడం వంటి అంశాలను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. ప్రతి విద్యార్థిని భవిష్యత్తులో కేవలం ఉద్యోగం కోసం కాకుండా మారుతున్న ప్రపంచాన్ని అర్థం చేసుకుని, దానిలో తన స్థానాన్ని సృష్టించుకునేలా తీర్చిదిద్దాలి. ముఖ్యంగా జెన్ జీ తరం పూర్తిగా భిన్నమైన ప్రపంచంలో పెరుగుతోంది. వారి ఆలోచనా విధానం, సమాచారాన్ని స్వీకరించే పద్ధతి, నేర్చుకునే తీరు గత తరాలతో పోలిస్తే భిన్నంగా ఉంది. వారికి గంటల తరబడి ఉపన్యాసాలు ఇవ్వడం కంటే అనుభవం ద్వారా నేర్చుకునే అవకాశాలు కల్పించాలి. ప్రయోగాలు, ప్రాజెక్టులు, చర్చలు, సమస్యల పరిష్కారం, క్షేత్రస్థాయి అధ్యయనం వంటి విధానాలను పెంచాలి. అంతేకాదు.. పాఠ్యపుస్తకం కూడా మారాలి. కేవలం పాఠాలను చదివి ప్రశ్నలకు జవాబులు రాసే పద్ధతికి బదులుగా, ఒక సమస్యను విద్యార్థి ముందుంచి దానికి పరిష్కారం కనుగొనేలా చేయాలి. ఒక వార్తను ఇచ్చి దాని నిజానిజాలను పరిశీలించమని చెప్పాలి. ఒక గ్రామంలో నీటి సమస్య ఉంటే దానికి శాస్త్రీయ పరిష్కారం ఏమిటో విద్యార్థులే ఆలోచించేలా చేయాలి. ఒక చిన్న వ్యాపార ఆలోచనను రూపొందించి దాని ఆదాయ--వ్యయాలను లెక్కించేలా చేయాలి. అంటే చదువు తరగతి గది గోడలు దాటి జీవితంతో అనుసంధానం కావాలి. ఇక పరీక్షల విధానంలోనూ మార్పు తప్పనిసరి. పుస్తకంలో ఉన్నదాన్ని యథాతథంగా గుర్తుపెట్టుకుని రాస్తే మార్కులు రావడం.. విద్యార్థి ప్రతిభకు సరైన కొలమానం కాదు. ప్రశ్నను అర్థం చేసుకోవడం, విశ్లేషించడం, కొత్త పరిష్కారాన్ని సూచించడం, సృజనాత్మకంగా ఆలోచించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. లేకపోతే విద్యార్థి పరీక్షలో విజయం సాధించినా.. జీవిత పరీక్షలో మాత్రం వెనుకబడే ప్రమాదం ఉంది. అయితే పాఠ్యాంశాల్లో మార్పు అంటే పాత జ్ఞానాన్ని పూర్తిగా పక్కనపెట్టడం కాదు. చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, భాష, గణితం, ప్రాథమిక విజ్ఞానం వంటి పునాది అంశాలు ఎప్పటికీ అవసరమే. కానీ వాటిని నేటి ప్రపంచంతో అనుసంధానించే విధానం మారాలి. గతాన్ని తెలుసుకుంటూనే భవిష్యత్తును నిర్మించగలిగే విద్యార్థిని తయారు చేయాలి. ఇందులో ఉపాధ్యాయుల పాత్ర మరింత కీలకం. పుస్తకం చెప్పే ఉపాధ్యాయుడి నుంచి.. విద్యార్థిని ఆలోచింపజేసే మార్గదర్శిగా ఉపాధ్యాయుడు మారాలి. అందుకు ఉపాధ్యాయులకు కూడా నిరంతర శిక్షణ అవసరం. కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాధనాలు, కొత్త బోధనా పద్ధతులపై అవగాహన పెంచాలి. లేకపోతే విద్యార్థి చేతిలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం.. తరగతి గదిలోని ఉపాధ్యాయుడి పరిజ్ఞానం కంటే ముందుకు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా విద్యా విధానాన్ని ఉద్యోగ మార్కెట్‌తో అనుసంధానం చేయాలి. రాబోయే పదేళ్లలో ఏ రంగాల్లో అవకాశాలు పెరుగుతాయి? ఏ నైపుణ్యాలకు డిమాండ్ ఉంటుంది? పరిశ్రమలకు ఎలాంటి మానవ వనరులు అవసరం? వీటిని అధ్యయనం చేసి పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు నవీకరించాలి. ఒకసారి పాఠ్యపుస్తకం ముద్రించి సంవత్సరాల తరబడి అదే బోధించే విధానం ఇక సరిపోదు. ప్రపంచం ప్రతి ఏడాది మారుతోంది. సాంకేతికత ప్రతి నెల మారుతోంది. కృత్రిమ మేధస్సు ప్రతి రోజూ కొత్త రూపం దాలుస్తోంది. అలాంటప్పుడు విద్యార్థులకు మాత్రం పాత పుస్తకాలనే అందించడం అంటే.. రేపటి ప్రపంచంలోకి నిన్నటి ఆయుధాలతో పంపించడమే. మన పిల్లలు భవిష్యత్తును నిర్మించబోతున్నారు. వారికి కేవలం మార్కులు కాదు.. మారుతున్న ప్రపంచాన్ని ఎదుర్కొనే మేధస్సు కావాలి. కేవలం డిగ్రీలు కాదు.. నైపుణ్యాలు కావాలి. కేవలం ఉద్యోగం కోసం చదువు కాదు.. కొత్త ఉద్యోగాలను సృష్టించే ఆలోచనా శక్తి కావాలి. అందుకే విద్యాశాఖలు, విద్యాధికారులు ఇక ఆలస్యం చేయకూడదు. పాఠ్యాంశాల సమగ్ర సమీక్షకు నిపుణులు, ఉపాధ్యాయులు, పరిశ్రమలు, సాంకేతిక రంగ నిపుణులు, విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలి. ప్రతి సంవత్సరం అవసరమైన మార్పులు చేసే చురుకైన పాఠ్య ప్రణాళికను రూపొందించాలి. ఎందుకంటే నేటి విద్యార్థి రేపటి ఉద్యోగి మాత్రమే కాదు.. రేపటి శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త, ఉపాధ్యాయుడు, వైద్యుడు, పరిపాలకుడు, సాంకేతిక నిపుణుడు, నాయకుడు. పాత చింతకాయ పచ్చడి లాంటి పాఠ్యాంశాలతో కొత్త ప్రపంచాన్ని నిర్మించలేం. కాలానికి తగ్గట్టు విద్య మారాలి. విద్యకు తగ్గట్టు నైపుణ్యాలు పెరగాలి. నైపుణ్యాలకు తగ్గట్టు అవకాశాలు రావాలి. ఏఐ యుగంలో మన విద్యార్థులు సాంకేతికతను చూసి భయపడేవారిగా కాదు.. సాంకేతికతను నడిపించేవారిగా ఎదగాలి. అదే రేపటి ఉజ్వల భారతానికి నిజమైన పునాది.



వినోద్ కుమార్
టెక్ ఇంజినీర్

# 1000 రోజుల వంచన పాలన




తెలంగాణ ఏర్పడినప్పుడు ఈ రాష్ట్రంపై ఎన్నో ఆశలు. స్వరాష్ట్రం వస్తే తమ బతుకులు మారతాయని ప్రజలు కలలు కన్నారు. పదేళ్ల పాటు ఒక ప్రభుత్వం పాలించింది. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టామని ఆ ప్రభుత్వం చెప్పుకుంది. ఆ తర్వాత ప్రజలు మార్పును కోరుకున్నారు. కొత్త ప్రభుత్వం వస్తే కొత్త ఆశలు నెరవేరుతాయని భావించారు. కాంగ్రెస్ ఆ ఆశలకు మరింత బలం చేకూర్చింది. ఆరు గ్యారంటీలు, వివిధ సామాజిక వర్గాల డిక్లరేషన్లు, వందలాది హామీలతో ప్రజల ముందుకు వెళ్లింది.

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కీలక హామీలను అమలు చేస్తామని చెప్పింది. కానీ ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తవుతున్నాయి. వంద రోజుల్లో చేస్తామన్న హామీలకు వెయ్యి రోజులు దాటినా పూర్తి రూపం ఎందుకు రాలేదు? ఇదే తెలంగాణ ప్రజల ముందున్న ప్రశ్న. ప్రభుత్వం కొన్ని హామీలను అమలు చేశామని చెబుతోంది. కొన్ని పథకాలు కొనసాగుతున్నాయి. కొన్ని హామీల అమలుకు ఆర్థిక పరిమితులు, న్యాయపరమైన సమస్యలు, పరిపాలనా ప్రక్రియలు అడ్డంకిగా ఉన్నాయని వివరణలు ఇస్తోంది. కానీ ప్రజల దృష్టిలో మాత్రం ఒకటే కొలమానం.. ఎన్నికల సమయంలో చెప్పింది ఏమిటి? ఇప్పుడు జరిగింది ఏమిటి? రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కొత్త కాదు. కానీ హామీ అనేది కేవలం ఓటు కోసం ఇచ్చే మాటగా మారితే ప్రజాస్వామ్యంపై నమ్మకమే దెబ్బతింటుంది. ఆరు గ్యారంటీలు కావచ్చు.. రైతు, యువత, మహిళలు, ఎస్సీ-ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చిన హామీలు కావచ్చు.. వాటి అమలుపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన లెక్క చెప్పాల్సిన సమయం వచ్చింది. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక భరోసా, రైతులకు పెట్టుబడి-రుణ విముక్తి, రైతు కూలీలకు సహాయం, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి వంటి అంశాలు నేరుగా కుటుంబాల జీవితాలను ప్రభావితం చేసేవి. ఇవి కేవలం ఎన్నికల వాగ్దానాలు కాదు.. ప్రజలు తమ భవిష్యత్తును వాటితో ముడిపెట్టుకున్న హామీలు. యువత పరిస్థితి మరింత ఆందోళనకరం. చదువులు పూర్తిచేసి ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న లక్షలాది మంది ఉన్నారు. ఉద్యోగ నియామకాలు జరిగాయా లేదా అన్న గణాంకాలకంటే.. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ప్రతి కుటుంబంలో ఆశ పెరిగిందా? అన్నదే అసలు ప్రశ్న. నియామక ప్రక్రియలు ఎప్పటికప్పుడు కొనసాగుతున్నా, ఉద్యోగ క్యాలెండర్ వంటి స్పష్టమైన వ్యవస్థ ఉంటే యువతలో నమ్మకం పెరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగం రాకపోయినా నైపుణ్యానికి తగ్గ ప్రైవేటు ఉపాధి లభించే వాతావరణం సృష్టించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. రైతు విషయంలోనూ రాజకీయ ప్రసంగాలకంటే పొలంలో పరిస్థితి ముఖ్యం. రైతుకు సకాలంలో పెట్టుబడి సాయం అందుతోందా? రుణభారం తగ్గిందా? పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందా? పంట నష్టపోతే పరిహారం అందుతోందా? ఇవే అన్నదాతకు సంబంధించిన అసలు ప్రశ్నలు. రైతు సంక్షేమం కేవలం నగదు సాయంతో పూర్తయ్యే విషయం కాదు. నీరు, విత్తనం, ఎరువు, రుణం, మార్కెట్, ధర.. అన్నీ కలిసినప్పుడే రైతు భరోసా సాకారమవుతుంది. అభివృద్ధి విషయంలోనూ ఇదే పరిస్థితి. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పడం సులువు. కానీ నగరంలోని రహదారులు, పారిశుద్ధ్యం, మురుగునీటి వ్యవస్థ, ప్రజా రవాణా, చెరువుల పరిరక్షణ, తాగునీరు వంటి మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే అసలు పాలన. నగరం వెలుపల తెలంగాణలోని పట్టణాలు, గ్రామాలకు కూడా సమాన ప్రాధాన్యం దక్కాలి. అయితే ఇక్కడ బీఆర్ఎస్ కూడా ఒక విషయం గుర్తుంచుకోవాలి. గతాన్ని పొగడటం మాత్రమే ప్రతిపక్ష బాధ్యత కాదు. గత ప్రభుత్వ హయాంలో అన్నీ అద్భుతంగా జరిగాయని చెప్పడం కూడా ప్రజలు పూర్తిగా అంగీకరించే పరిస్థితి లేదు. అప్పటి ప్రభుత్వంలో ఉన్న లోపాలు, ఆర్థిక నిర్ణయాలు, నిరుద్యోగుల అసంతృప్తి, ఉద్యోగ నియామకాల్లో జరిగిన జాప్యాలు.. ఇవన్నీ ప్రజలకు తెలుసు. కాబట్టి ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే ప్రతిపక్షం ముందుగా తన పాలనపై కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రతిపక్ష విమర్శలను రాజకీయ కక్షగా కొట్టిపారేయడం మానాలి. వెయ్యి రోజులు అంటే చిన్న కాలం కాదు. ఒక ప్రభుత్వం తన పాలన దిశను నిరూపించుకోవడానికి ఇది చాలినంత సమయం. ఇంకా అమలు కాని హామీలుంటే వాటికి గడువులు ప్రకటించాలి. ఆర్థికంగా సాధ్యం కానివి ఉంటే ప్రజలకు నిజాయితీగా చెప్పాలి. అమలు చేసినవాటికి లెక్కలు చూపాలి. ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ప్రజలకు కావాల్సింది మరో రాజకీయ యుద్ధం కాదు. మాట నిలబెట్టుకునే ప్రభుత్వం. ప్రతిపక్షానికి కావాల్సింది కేవలం ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశం కాదు. ప్రజల సమస్యలను శాసనసభలో, ప్రజాక్షేత్రంలో బలంగా వినిపించే బాధ్యత. అధికార పక్షానికి కావాల్సింది ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే రాజకీయ వ్యూహం కాదు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే పరిపాలనా సామర్థ్యం. వెయ్యి రోజుల మైలురాయి ఒక ప్రభుత్వానికి సంబరాల సందర్భం కావచ్చు. కానీ ప్రజలకు మాత్రం తమకు ఇచ్చిన హామీలను తిరిగి లెక్కించుకునే సందర్భం.

ఎన్ని హామీలు ఇచ్చారు?
ఎన్ని అమలు చేశారు?
ఎన్ని సగంలో ఉన్నాయి?
ఎన్ని అమలుకాలేదు?
ఎందుకు కాలేదు?
ఎప్పటికి అమలు చేస్తారు?

ఈ ఐదు ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలి. ఎందుకంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి ప్రజలు తమ ఓటును చెల్లించారు. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టే బాధ్యత ప్రభుత్వానిది. వెయ్యి రోజుల పాలన తర్వాత కూడా ప్రజలు 'ఇంకెప్పుడు?' అని అడగాల్సి వస్తే.. అది కేవలం హామీల ఆలస్యం కాదు, పాలనపై ప్రజల్లో పెరుగుతున్న నిరాశకు సంకేతం. తెలంగాణ ప్రజలు ఏ పార్టీకి శాశ్వత బానిసలు కాదు. అధికారాన్ని ఇస్తారు.. అవసరమైతే వెనక్కి తీసుకుంటారు. అందుకే కాంగ్రెస్ అయినా, బీఆర్ఎస్ అయినా, మరే పార్టీ అయినా ప్రజల తీర్పును గౌరవించాలి. వెయ్యి రోజులు పూర్తయ్యాయి. ఇక మాటల సమయం కాదు.. లెక్కల సమయం. హామీల సమయం కాదు.. అమలు సమయం. రాజకీయ ప్రచారం కాదు.. ప్రజలకు జవాబుదారీతనం కావాలి.



నవీన్ పటేల్, బీఎస్సీ, ఎల్ఎల్‌బీ
అడ్వకేట్, బీఆర్ఎస్ సీనియర్ లీడర్,
యూసూఫ్‌గూడ డివిజన్,
జూబ్లీహిల్స్ నియోజకవర్గం

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.